వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 7

శనివారం, జూన్ 10, 2023

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

జూన్ 14 నుంచి ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్



హైదరాబాద్, జూన్ 9 (వాయిస్ టుడే): రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐ, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల భర్తీ తుది దశకు చేరుకుంది. ఇటీవలే తుది రాతపరీక్షల ఫలితాలను టీఎస్ఎల్పీఆర్బీ విడుదల చేసింది. తుది రాతపరీక్ష ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 14వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 18 కేంద్రాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. తుది ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులు టీఎస్ఎల్పీఆర్బీ వెబ్‌సైట్ నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంబంధించిన లెటర్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ లెటర్లు 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 8 గంటల వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనున్నాయి.

తొమ్మిదేళ్లలో సీన్ రివర్స్

సిద్దిపేటలో నిర్వహించిన సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటటౌన్, జూన్ 9 (వాయిస్ టుడే): 60 ఏళ్ల పాలన లో చేయలేని అభివృద్ధి తొమ్మిదేళ్ల పాలన లో రెట్టింపు చేశామని, నైన్‌ఇయర్స్ (తొమ్మిదేళ్ల)లో సీన్ రివర్స్ అయ్యిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సంక్షేమ దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మతో కలిసి మంత్రి హరీశ్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పలు సంక్షేమ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు

- మిగతా 2వ పేజీలో

నమ్మించి..వంచించి..హతమార్చాడు

సరూర్‌నగర్‌లో పూజారి ఘాతుకం.. హత్యకు దారితీసిన వివాహేతర బంధం
మ్యాన్‌హోల్‌లో మృతదేహాన్ని పూడ్చి, బొడ్రాయి పండుగలో పాల్గొన్న వైనం

శంషాబాద్ రూరల్/ఎల్బీనగర్, జూన్ 9 (వాయిస్ టుడే): ఆలయానికి వచ్చిన భక్తురాలితో వివాహేతర సంబం ధం పెట్టుకొని, పెండ్లి ప్రస్తావన తేగానే హతమార్చాడో పూజారి. తనకేపాపం తెలియ దన్నట్టు హతురాలి తల్లితో కలిసి తన మేన కోడలు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసి తప్పుదారి పట్టించాడు. అంతటి తో ఆగకుండా తాను పూజలు చేసే దేవా లయం పక్కనే శవాన్ని పూడ్చి, దర్జాగా బొడ్రాయి వేడుకలను

- మిగతా 2వ పేజీలో

చేప మందు ప్రసాదం పంపిణీ ప్రారంభం

హైదరాబాద్, జూన్ 9 (వాయిస్ టుడే): నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప మందు ప్రసాదం పంపిణీ ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేప ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... చేప ప్రసాద పంపిణీకి తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. 175 ఏళ్ళ నుంచి బత్తిని కుటుంబ సభ్యులు ఆస్తమా భాదితులకు చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారన్నారు. రేపు ఉదయం 8 గంటల వరకు 24 గంటల పాటు చేప ప్రసాద పంపిణీ

- మిగతా 2వ పేజీలో

రియల్ టాక్
డైలీ KK కాలమ్

దేశానికి అన్నదాత
పేదరికమే నొసటిరాత
రైతుకు నిలువెత్తు రూపమతడు
మన మున్నూరు కాపు కులస్తుడు
వ్యవసాయమే వృత్తి
లేదు మరో ప్రవృత్తి
సాగుబడే జీవనాధారం
వేరే లేదు కదా ఆధారం
కాలం కలిసొస్తేనే చేతికి పంట
ప్రకృతి ప్రకోపిస్తే చీకటే ఇంట
ఎన్నో ఒడిదొడుకుల్లో బతుకుతడు
మనుషుల కంచంలో మెతుకతడు
సీఎం కేసీఆర్ జర ఇటు చూడు
బుక్కెడు బువ్వనిచ్చె వాళ్ళగోడు
కావాలి MK Finance corporation
ఇవ్వాలి సర్కారు Clarification
విడుదల చేయాలి Notification

– కత్తెరశాల కుమారస్వామి
కవి, రచయిత, జర్నలిస్టు

వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీని ఓడించాలని కంకణం కట్టుకుని.. ఇందుకోసం అన్ని పార్టీల నాయకులతో మాట్లాడిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై.. విపక్ష కూటమి పార్టీల్లో నమ్మకం కుదరట్లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి కారణాలు లేకపోలేదు. బీజేపీ మాట వింటేనే ఆవేశంతో ఊగిపోయే కేసీఆర్ గత కొన్ని రోజులుగా ఆ పార్టీ పట్ల ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం లేదు. లిక్కర్ స్కామ్ నుంచి కూతురు కవితను కాపాడుకునేందుకు బీజేపీకి రహస్య మిత్రుడిగా మారారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో సొంత ఎజెండా ఏర్పరచుకుని నడిచే విధంగా కేసీఆర్ తీరు ఉందని విపక్ష పార్టీల నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

నమ్మకం కుదరట్లేదా

అంతేకాకుండా.. గతంలో మోడి ప్రవేశ పెట్టిన పలు బిల్లులకు ఏకపక్షంగా ఆమోదం తెలిపిన కేసీఆర్.. కేవలం జాతీయ రాజకీయాల్లో అడుగు పెట్టాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్‌గా పార్టీని మార్చారని.. మోడీని బలంగా ఎదుర్కోవాలనే చిత్తశుద్ధి ఆయనలో కనిపించడం లేదనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

దీంతో సొంత ఎజెండా కంటే బీజేపీ వ్యతిరేక ఎజెండానే పెట్టుకున్న పార్టీలకే విపక్ష కూటమిలో చోటివ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

- విపక్ష కూటమి సమావేశానికి కేసీఆర్‌కు అందని ఆహ్వానం
- బీజేపీకి రహస్య మిత్రుడిగా మారారనే అనుమానం
- కేజ్రీవాల్ కూడా హాజరవుతున్న సమావేశం
- ఇప్పటి వరకు కేసీఆర్‌కు సన్నిహితంగా ఉంటున్న ఆప్ నేత
- రానున్న రోజుల్లో పరిస్థితులు తలకిందులయ్యే అవకాశం

హైదరాబాద్, జూన్ 9 (వాయిస్ టుడే): జాతీయ రాజకీయాల్లో రోజుకో అనూహ్య పరిణామం చోటు చేసుకుంటోంది. మిత్రులు శత్రువులుగా, శత్రువులు మిత్రులుగానూ మారుతున్నారు. ఈ కోవలోనే బీజేపీ విపక్ష కూటమి మాట తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. దేశంలోని దాదాపు అన్ని ప్రాంతీయ పార్టీలు ఈ కూటమిలో చేతులు కలిపి.. కలిసికట్టుగా నడిచేందుకు సిద్ధమయ్యారు. అయితే.. ఇందులో అత్యంత అనూహ్యమైన పరిణామం.. విపక్ష కూటమికి.. బీఆర్ఎస్‌ను దూరంగా పెట్టడం. ఈ నెల 23న పాట్నాలో జరగనున్న విపక్ష కూటమి సమావేశానికి ఇప్పటి వరకు బీఆర్ఎస్ అధినేతకు ఆహ్వానం అందలేదని సమాచారం. దీనివెనుక ఎన్నో అంశాలు ఇమిడి ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కాంగ్రెస్ ఉండడమే కారణమా

బీఆర్ఎస్ అధినేత తీరుపై విపక్ష కూటమి నేతలకు ఉన్న అభిప్రాయానికి భిన్నమైన వాదన బీఆర్ఎస్ శ్రేణుల నుంచి వినిపిస్తోంది. విపక్ష కూటమిలో కాంగ్రెస్ ఉండాల్సిందే అనే తీరులో ప్రాంతీయ పార్టీలు ఉన్న సంగతి తెలిసిందే. దీంతో.. కాంగ్రెస్‌ను బద్ధ విరోధిగా పేర్కొంటున్న కేసీఆర్‌కు.. ఆ పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమిలో చేరడం ఇష్టం లేదనే ఆలోచనతో ఉన్నట్లు పార్టీ వర్గాల నుంచి సమాచారం. అందుకే విపక్ష కూటమికి దూరంగా ఉంటున్నట్లు చెబుతున్నారు.

కేజ్రీవాల్.. దూరం జరుగుతారా

టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి.. జాతీయ రాజకీయాలు మొదలు పెట్టినప్పటి నుంచి కేసీఆర్‌కు సన్నిహితంగా మెలుగుతున్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్ కూడా తాజా పరిణామాలతో కేసీఆర్‌కు దూరమవుతారా? అన్న చర్చ వేస్తామంటోంది. నేను మూడేళ్లు కష్టపడి చెమటోడ్చి ధరణి పోర్టల్ తెచ్చిన. కేవలం రైతుల భూములు ఆగం కావొద్దని ధరణి తెచ్చినం. ఇవాళ పల్లెలన్నీ ప్రశాంతంగా

- మిగతా 2వ పేజీలో

దివ్యాంగులకు రూ.4,116 పింఛన్

- జూలై నుంచి అమల్లోకి.. సీఎం ప్రకటన..
- ప్రజాస్వామ్యం ఉండాలంటే అధికారం మళ్లీ మాకే ఇవ్వాలి
- సింగరేణిని కాంగ్రెస్ సగం ముంచితే బీజేపీ నిండా ముంచాలని కంకణం కట్టుకుంది
- మంచిర్యాలలో ప్రగతి నివేదన సభలో ముఖ్యమంత్రి కేసీఆర్
- ఎన్నికల ప్రచార సభను తలపించేలా ప్రసంగం
- వృత్తి కులాలకు రూ.లక్ష సాయం పథకం ప్రారంభం
- కలెక్టరేట్, బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం

హైదరాబాద్/మంచిర్యాల, జూన్ 9 (వాయిస్ టుడే): దివ్యాంగులకు ప్రతి నెలా ఇచ్చే పింఛనను రూ.3116 నుంచి రూ.4116కు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇది జూలై నుంచే అమల్లోకి వస్తుందని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మంచిర్యాల జిల్లాలో ప్రగతి నివేదన సభలో సీఎం ఈ ప్రకటన చేశారు. దీంతోపాటు బీసీల్లోని వృత్తికులాలకు అందజేసే రూ.1 లక్ష సాయం పథకాన్ని, గొల్లకురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. అంతకుముందు మంచిర్యాలలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ భవనం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కాగా, మంచిర్యాల సభలో సీఎం ప్రసంగమంతా ఎన్నికల ప్రచారంలా సాగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికి ఉండాలంటే ప్రజలు మళ్లీ బీఆర్ఎసకే అధికారం ఇవ్వాలని అన్నారు. దళారుల రాజ్యం వద్దనుకుంటే, అధికారం ప్రజల దగ్గరే ఉండాలనుకుంటే.. వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఏ శిక్ష విధించాలో ఆ శిక్ష వేయాలన్నారు. కాంగ్రెసకు 50 ఏళ్లు అవకాశం ఇస్తే కరెంట్ ఇచ్చిన్రా? రైతుబంధు ఇచ్చిన్రా? అని ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే అంతా బయటికి వస్తుంటారని, మళ్లీ ఆపద మొక్కులు మొక్కుకుంటూ వస్తారని, అంగడి, జాతర మొదలవుతుందని వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. ధరణిని బంగాళాఖాతంలో

- మిగతా 2వ పేజీలో

ఈటల రాజేందర్‌కు ప్రచార కమిటీ బాధ్యతలు

- పరిశీలనలో 3 ఫార్ములాలు
- ఈటల రాజేందర్‌కు ప్రచార కమిటీ బాధ్యతలు
- పార్టీ పగ్గాలు అరుణకు?
- బీజేపీ అధిష్ఠానం చర్చలు ఎట్టకేలకు ఒక కొలిక్కి
- ఏ క్షణమైనా కీలక ప్రకటన వెలువడే అవకాశం
- గువాహటిలో ఈటలతో హిమంత కీలక చర్చలు

న్యూఢిల్లీ, జూన్ 9 (వాయిస్ టుడే): తెలంగాణలో బీఆర్ఎసను ఢీకొనేందుకు అవలంబించాల్సిన వ్యూహంపై గత కొద్ది నెలలుగా ఢిల్లీ బీజేపీ అగ్రనేతలతో జరుగుతున్న చర్చలు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. బండి సంజయ్‌ను నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించి.. బయటి నుంచి వచ్చిన ఈటల రాజేందర్, డీకేఅరుణ వంటి నేతలకు పార్టీ సారథ్యం అప్పగించి ఎన్నికల బరిలో ఉధృతంగా దిగితేనే రాష్ట్రంలో బీఆర్ఎసకు బీజేపీ గట్టి పోటీ ఇవ్వగలుగుతుందనే అభిప్రాయానికి పార్టీ అధిష్ఠానం వచ్చినట్లు తెలిసింది. ఈమేరకు.. బండి సంజయ్‌కు కేంద్రంలో సహాయ మంత్రి పదవి ఇచ్చి.. డీకే అరుణకు పార్టీ అధ్యక్ష పదవి.. ఈటలకు పార్టీ ప్రచార కమిటీ చైర్మన పదవితోపాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక అధికారాలు ఇవ్వాలన్న ప్రతిపాదనపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, సంయుక్త ప్రధాన కార్యదర్శి సౌదాన్ సింగ్ తదితరులు కీలక చర్చలు జరిపినప్పుడు తెలంగాణ గురించి

- మిగతా 2వ పేజీలో

ధరణిని రద్దు చేస్తాం

పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 9 (వాయిస్ టుడే): అభయ హస్తం పేరుతో ఐదు ప్రధాన అంశాలతో ప్రజల దగ్గరికి వెళ్తామని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కత్రియ హోటల్ వద్ద మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 17న మేనిఫెస్టో విడుదల చేస్తామని స్పష్టం చేశారు. పలు పార్టీల నేతలతో అధిష్ఠానం చర్చలు జరిపిందని, ప్రజలు కోరుకుంటున్న విధంగానే చేరికలు ఉంటాయని, కర్ణాటక ఫలితాలే తెలంగాణలో రిపీట్ అవుతాయన్నారు. సీఎం కేసీఆర్‌కు తన పేరు తీసే దైర్యం ఉందా? అని ప్రశ్నించారు. దమ్ముంటే తన పేరు తీయాలని ముఖ్యమంత్రికి సవాలు విసురుతున్నానన్నారు. తన భూమి వివరాల కోసం చాలా రోజుల నుంచి రంగారెడ్డి

- మిగతా 2వ పేజీలో

రేపు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

ఏర్పాట్లు పూర్తి.. కట్టుదిట్టమైన భద్రత

హైదరాబాద్, జూన్ 9 (వాయిస్ టుడే): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్ష నిర్వహణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అడ్డంకులు తొలగిపోయాయి. రాష్ట్రంలో 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి టీఎసపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేయగా.. గత అక్టోబరు 16న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. ఫలితాలనూ ప్రకటించారు. అయితే పేపర్ లీక్ నేపథ్యంతో ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేశారు. రద్దయిన పరీక్షను ఆదివారం (ఈ నెల 11న) నిర్వహించనున్నారు. గ్రూప్-1 పోస్టుల కోసం సుమారు

- మిగతా 2వ పేజీలో

తెలంగాణలో రామరాజ్య స్థాపనే లక్ష్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

ఖమ్మం/హైదరాబాద్, జూన్ 9 (వాయిస్ టుడే): ప్రజాస్వామ్య తెలంగాణ సాధించి తద్వారా రామరాజ్యాన్ని స్థాపించడమే బీజేపీ అంతిమ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. బీజేపీ ప్రజల గుండెల్లో ఉందని, ఇప్పటి వరకు కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎసకు అధికారమిచ్చి ప్రజలు విసుగుచెందారని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకే అధికారం ఇవ్వబోతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నీ సర్వేలు చెబుతున్నాయ న్నారు. మహాసంపర్క్ అభియాన యాత్రలో భాగంగా ఈ నెల 15న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు కేంద్ర హోం మంత్రి అమిత షా హాజరవనున్న నేపథ్యంలో సన్నాహక సమావేశాన్ని శుక్రవారం ఇక్కడ ఓ ఫంక్షన్

- మిగతా 2వ పేజీలో

ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

దేవరకొండ/చందంపేట, జూన్ 9 (వాయిస్ టుడే): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి, డిండి ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను పూర్తిచేసి సాగునీరు ఇస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో రెండో రోజు పీపుల్స్‌మార్చ్

- మిగతా 2వ పేజీలో

ధరణిని రద్దు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ దగ్గరకి తిరుగుతున్నానని రేవంత్ అన్నారు. గడీల పాలన పునరుద్ధరించడానికి సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చుకున్నారని విమర్శించారు. భూస్వాములను తరిమి కొట్టడానికే నక్షల్బరీ ఉద్యమం వచ్చిందని, ధరణిలో పోర్టల్ ప్రభుత్వం చేతిలో లేదని, దళారుల చేతిలోకి పోయిందని అన్నారు. ధరణి లేకపోతే రైతుబందు రాదనడం బ్రతక్కువ పని అని మండిపడ్డారు. ధరణి మోసాల వల్ల కేసీఆర్ కుటుంబం చర్లపల్లి జైలుకి వెళ్తుందన్నారు. చర్లపల్లి జైలులో కేసీఆర్ కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామన్నారు. బావ బామ్మర్ధులు (కేటీఆర్, హరీష్ రావు) వస్తే బహిరంగంగా చర్చిద్దామని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలోనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. రెండు వేల రూపాయలకు రెండు ఫుట్ బాటిల్స్ కూడా రావడం లేదన్నారు. తండ్రి కొడుకులు నిప్పుతొక్కిన కోతుల్లా ఎగురుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబంలా ప్రజలను దోచుకోమని స్పష్టం చేశారు. సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపంపై ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష వేయిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

రేపు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

3.8 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష హాల్‌టికెట్లు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఓఎంఆర్ షీట్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి మ?ధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష జరగనుంది. అభ్యర్థులకు సూచనలు ఇచ్చేందుకు జిల్లాకొకటి చొప్పున 33 హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణలో భాగస్వాములయ్యే సిబ్బందిపై నిఘా పెట్టనున్నారు. పరీక్ష ప్రారంభానికి 2 గంటల ముందే కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించనున్నారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లను మూసేస్తారు. అంటే ఉదయం 10.15 గంటలలోపే పరీక్ష హాల్‌లోకి అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత అనుమతించరు. అలాగే పరీక్ష కేంద్రంలోకి పెన్సిల్, ఇంక్‌పెన్, జెల్‌పెన్ వంటి వాటికి అనుమతి లేదు. బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌లను మాత్రమే అనుమతించనున్నారు. అభ్యర్థులు షూతో వస్తే అనుమతించరు. చెప్పులు వేసుకుని రావాలి. నిబంధనలను అతిక్రమిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. ఇక గ్రూప్-1 పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూసేందుకు పోలీస్‌శాఖ పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టింది. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీ స్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని అన్ని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని కమిషనరేట్లు, ఎస్పీ కా ర్యాలయాల పరిధిలో ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్ష కేంద్రానికి 500 మీటర్ల దూరం వరకు జనం గుమిగూడరాదని ఆదేశాలిచ్చారు.

తెలంగాణలో రామరాజ్య స్థాపనే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

హాలులో నిర్వహించారు. బండి సంజయ్ మాట్లాడుతూ త్వరలో కొత్తగూడెంలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. సీతారాముల కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు కూడా తీసుకురాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేసీఆర్ నిజమైన హిందువు కాదన్నారు. రాష్ట్రంలో బీజేపీ సింహం మాదిరిగా ఒంటరిగానే పోటీ చేస్తుందని, గుంటనక్కలు గుంపులుగా వస్తాయని విపక్షాలపై మండిపడ్డారు. కమ్యూనిస్టు పార్టీలు దాల్ రైస్ పార్టీల్లాంటివని, ఎమ్మెల్యే పదవుల కోసం, కేసుల నుంచి తప్పించుకోవడానికే బీఆర్ఎసకు మద్దతు ప్రకటించాయన్నారు. కమ్యూనిస్టులను సూది, దబ్బనం లాంటి పార్టీలని విమర్శించిన కేసీఆర్‌కు మద్దతు పలికాయని విమర్శించారు. ఖమ్మంలో సభ జరిగే సర్దార్ పటేల్ స్టేడియాన్ని బండి సంజయ్ పరిశీలించారు. సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి లక్ష మంది హాజరవుతారని విలేకరులకు చెప్పారు. స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడుతున్న పిల్లలను పలకరించి, వారితో కొద్దిసేపు ఫుట్‌బాల్ ఆడారు. కాగా, తెలంగాణలో 13 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతివ్వడం రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలేజీల విషయంలో కేంద్రం సహకరించడం లేదని బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమన్నారు.

ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పాదయాత్ర కొనసాగింది. పాతూరుతండా నుంచి ఉదయం 9గంటలకు పాదయాత్ర ప్రారంభమై కలమందతండా, మురుపునూతల, గన్నేర్లపల్లి, గన్నేర్లపల్లి క్రాస్‌రోడ్డు, పోలేపల్లి, బ్రిడ్జితండా నుంచి మైనంపల్లి గేటు వరకు కొనసాగింది. దారిలో ప్రజలను, మహిళా రైతులను, కూలీలను కలిసి విక్రమార్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుపునూతల గ్రామంలో పొలంలో పనిచేస్తున్న మహిళా కూలీల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డిండి మండలం గోనబోయినపల్లి గ్రామం నుంచి పత్తి విత్తనాలు నాటేందుకు వచ్చామని కూలీలు తెలపగా, సీఎం కేసీఆర్ డబుల్‌బెడ్‌రూం ఇచ్చారా? అని ప్రశ్నించారు. దీంతో గ్రామంలో ఒక్కరికి కూడా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరుకాలేదని మహిళా కూలీలు తెలిపారు. 64 ఏళ్లు వచ్చినా పింఛన్ రావడం లేదని, తెలంగాణ వచ్చినా తమ బతుకుల్లో ఎలాంటి మార్పురాలేదని మహిళ కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో భట్టి మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇళ్లు నిర్మిస్తామని, రుణమాఫీ, పింఛన్లు, పావలా వడ్డీకి రుణాలు ఇచ్చి ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మురుపునూతలకు చెందిన తిరుపతమ్మ మాట్లాడూతు, వ్యవసాయాన్ని పండగ చేస్తానన్నా కేసీఆర్ మాటలు అమలుకాలేదని, ధాన్యం రోడ్లపై పోసి నెలరోజులైన కొనుగోలు చేయకుంటే తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయించామని తెలిపింది. గన్నేర్లపల్లిలో మహిళా కూలీలతో కలిసి భట్టి పత్తి విత్తనాలు విత్తి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణకు వర్ష సూచన.. మూడ్రోజుల పాటు..!

హైదరాబాద్: తెలంగాణలో మూడ్రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు, రేపు తెలంగాణలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులుతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే ఛాన్సుం దని తెలిపింది. ఇక ఎల్లుండి ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షములు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దక్షిణ చత్తీస్‌గఢ్ పరిసరాల్లోని ఒడిశాలో ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 1.5 కిమీ ఎత్తు వరకు వ్యాపించి ఉంది. దిగువ స్థాయిలోని గాలులు ముఖ్యంగా వాయువ్య మరియు పశ్చిమ దిశల నుంచి తెలంగాణ రాష్ట్రం వైపుకి వీస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో తెలంగాణలో ఈరోజు అక్కడక్కడ.. రేపు, ఎల్లుండి కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే నైరుతి రుతుపవనాలు గురువారం కేరళను తాకాయి. త్వరలోనే తెలుగు రాష్ట్రాల్లో విస్తరించ నున్నాయి. మరోవైపు రైతులు కూడా తొలకరి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. దీంతో వర్షాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందాలని కోరుకుంటున్నారు.

దివ్యాంగులకు రూ.4,116 పింఛన్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నయి. కాంగ్రెస్ పార్టీ వచ్చి ధరణిని తీసేస్తే మళ్లీ పాత రిజిస్ట్రేషన్ల పద్ధతి వస్తుంది. మళ్లీ వీఆర్‌వోలు, పట్వారీలు, మళ్లీ అదే రాజ్యం వస్తది. ధరణి తీసేస్తే రైతుబంధు డబ్బులు ఎట్లా వస్తాయి? ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఇబ్బందులు తప్పవు" అని ప్రజలను సీఎం హెచ్చరించారు. ధరణితోనే భూముల ధరలు పెరిగాయన్నారు. రైతులంతా తలకాయలు పగలుగొ ట్టుకోవాలని, వకీళ్లు, పోలీసుల చుట్టూ తిరగాలనే ధరణిని తీసేస్తా మంటున్నారని చెప్పారు. రైతులు తమ భూమిని, సాధికారతను నిలబెట్టుకోవాలంటే కాంగ్రెసవాళ్లనే బంగాళాఖాతంలో వేయాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎసగా అందుకే మార్చాం..

దేశవ్యాప్తంగా అన్యాయం జరుగుతోందని, దానిని ఎదుర్కోవడానికే టీఆర్ఎసను బీఆర్ఎసగా మార్చి దేశవ్యాప్తంగా పోరాటానికి నడుం కట్టామని కేసీఆర్ అన్నారు. "దళితబంధు కింద 1.30 లక్షల మంది కి సహాయం చేస్తాం. వికలాంగుల పెన్షనను రూ.1000 అదనంగా పెంచుతున్నాం. జూలై నుంచి రూ. 4116 పింఛన అందుతుంది. అప్పటి (కాంగ్రెస్) కాలంలో మనిషి చనిపోతే.. శ్మశానవాటికల్లేవు. ప్రతి ఊర్లో ఇంటింటికీ తాగునీరు, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణం, ప్రతి ఊరికి ట్రాక్టర్ ఇచ్చాం. ఎప్పుడన్నా కలగన్నామా? ఇంతకు ముందు లేరా ముఖ్యమంత్రులు? చేయలేదేందుకు? యాభై ఏళ్ల కాంగ్రెస్, టీడీపీ-బీజేపీ పరిపాలనపై ప్రజలు చర్చ పెట్టాలె. ప్రజల్లో చైతన్యం తేవాలె. పచ్చగా కళకళలాడుతున్న తెలంగాణను పైకి తీసుకెళదామా? చెడగొట్టుకుందామా?"అని ప్రశ్నించారు.

సింగరేణిని అమ్మేందుకు బీజేపీ ప్రయత్నం

సింగరేణిని కాంగ్రెస్ సగం ముంచితే.. నిండా ముంచడానికి బీజేపీ కంకణం కట్టుకొని తిరుగుతోందని సీఎం కేసీఆర్ ఆరోపించారు. బొగ్గు గనులు ఎవరికీ ఇవ్వబోమని తెలంగాణలో మాటిచ్చి, బెంగుళూరుకుపోయి బొగ్గు గనులకు టెండర్లు పిలిచారని మండి పడ్డారు. "సింగరేణి నిజాం కాలంలో మొదలైన సంస్థ. కాంగ్రెస్ హయాంలో సర్వనాశనం చేశారు. కేంద్రం వద్ద అప్పులు తెచ్చి... కేంద్ర ప్రభుత్వానికి సింగరేణిలో 49 శాతం వాటా అమ్మేశారు" అని తెలిపారు. తెలంగాణ వచ్చాక దాని నడకనే మార్చేశామని, రూ.11 వేల కోట్లు ఉన్న టర్నోవర్ ప్రస్తుతం రూ.33 వేల కోట్లకు చేరిందన్నారు.

జిల్లాల విభజనతో ఎంతో అభివృద్ధి

రాష్ట్ర అభివృద్ధిలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధిలో భాగంగా నాయీ బ్రాహ్మణులకు మోడరన్ సెలూన్, రజకులకు మోడరన్ ఇస్త్రీ షాపుల ఏర్పాటుకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మంచిర్యాల వేదికగా ప్రారంభి స్తున్నామని తెలిపారు. రెండో విడుత గొర్రెల పంపిణీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 3.80 లక్షల లబ్ధిదారులకు రూ.6 వేల కోట్ల వ్యయంతో గొర్రెలు పంపిణీ చేసేందుకు కార్యాచరణ రూపొం దించామన్నారు. అనంతరం రూ.లక్ష సాయం పథకం, గొర్రెల పంపిణీ కింద ఇద్దరు చొప్పున లబ్ధిదారులకు సీఎం చెక్కులు అందజేశారు.

మెడికల్ కాలేజీ భవనానికి శంకుస్థాపన..

మంచిర్యాల జిల్లాలోని మెడికల్ కళాశాలకు రూ.205 కోట్లతో శాశ్వత భవన నిర్మాణానికి సీఎం కేసీఆర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.164 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి నదిపై నిర్మించనున్న మంచిర్యాల-అంతర్గాం వంతెనకూ శంకుస్థాపన చేశారు. చెన్నూరు ఎత్తిపోతల పథకంతోపాటు మందమర్రిలో రూ.500 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి సీఎం శంకుస్థాపన చేశారు. కాగా, దివ్యాంగులకు పింఛనను రూ.4,016కు పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై మంత్రి కొప్పుల ఈశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ విపక్ష.. గులాబీ బాస్‌పై నమ్మకం కుదరట్లేదా?

(మొదటి పేజీ తరువాయి)

కూడా మొదలైంది. ఎందుకంటే.. కేవలం కేజ్రీవాల్‌ను ఇరికించాలనే ఉద్దేశంతో ఉన్న బీజేపీ.. దానికి అనుగుణంగా పావులు కదిపి కేసీఆర్‌ను సరెండర్ చేసుకున్నారని.. దాని ఫలితంగానే లిక్కర్‌స్కామ్‌లో కవితకు ఊరట కల్పించేలా వ్యవహరిస్తోందని కూడా వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో.. ఇదే స్కామ్ కారణంగా సన్నిహితులైన కేజ్రీవాల్, కేసీఆర్‌ల మధ్య.. దూరం పెరిగే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయం. శత్రువుకు మిత్రుడు కూడా శత్రువే అవుతాడనే సిద్ధాంతం కేసీఆర్, కేజ్రీవాల్ విషయంలో తెరపైకి వచ్చిన ఆశ్చర్యపోనక్కర్లేదనే విశ్లేషణలు సైతం వ్యక్తమవుతున్నాయి.

కూటమి కీలక అజెండా.. సాధ్యమేనా: ఇదిలా ఉంటే.. విపక్ష కూటమి పార్టీలు నిర్వహించనున్న సమావేశంలో కీలక అజెండాగా పెట్టుకున్న అంశం సాధ్యమేనా అనే ప్రశ్నలు మొదలయ్యాయి. అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో.. బీజేపీ ఓటమే లక్ష్యంగా.. ఆయా నియోజకవర్గాల్లో పార్టీతో సంబంధం లేకుండా బీజేపీకి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థిని నిలబెట్టాలని.. ఆ అభ్యర్థికి కూటమిలోని మిగతా పార్టీలు మద్దతిచ్చి గెలిపించాలని ఆలోచన చేస్తున్నాయి. అయితే ఆ ఆలోచన ఎంత వరకు ఆచరణలో సఫలం అవుతుందనే సందేహాలు తలెత్తున్నాయి. 'ప్రాంతీయ పార్టీల్లో గెలుపు గుర్రాలు అనుకునే నాయకులు ఎందరో ఉంటారు. అలాంటి నేతలు.. త్యాగాలు చేసి వేరే అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తారనుకోవడం పొరపాటు అవుతుంది. ముఖ్యంగా ఈ సమస్య కాంగ్రెస్‌లో తలెత్తుతుంది. జాతీయ పార్టీగా ఉన్న ఈ పార్టీలో అన్ని రాష్ట్రాల్లోనూ నేతలు.. టికెట్లు ఆశిస్తారు. తమదే గెలుపు అనే ధీమాతో ఉంటారు. వీరు ప్రాంతీయ పార్టీల నాయకులకు టికెట్లు ఇచ్చి వారికి మద్దతు ఇవ్వడానికి ఏ మాత్రం సిద్ధంగా ఉండరు' అని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

మొత్తంగా చూస్తే.. బీజేపీ విపక్ష కూటమి సమావేశం, కేసీఆర్ పట్ల వ్యవహరిస్తున్న తీరు.. ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో బీజేపీ వర్గాలు సైతం విపక్ష కూటమి అడుగుల పై నిఘా వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు సమాచారం. ఏదిఏమైనప్పటికీ.. ఈ నెల 23న జరిగే కూటమి సమావేశం ముగిస్తే.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీ ఎలా వ్యవహరిస్తుందనే విషయం స్పష్టమవనుంది. దీంతో అందరి చూపు 23వ తేదీ, పాట్నా వేదికపైనే ఉంది. ఆ రోజు దేశ రాజకీయాల్లో కీలక ఘట్టం ఆవిష్కృతం అవుతుందనే అభిప్రాయాలు సైతం వినిపిస్తున్నాయి.

ఈటల రాజేందర్‌కు ప్రచార కమిటీ బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక వ్యూహరచన చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

తెలంగాణకు సంబంధించిన ఎన్నికల వ్యూహరచనలో.. అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వ శర్మ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని.. ప్రస్తుత తరుణంలో రాష్ట్రంలో ఈటలకే పార్టీ తరఫున కీలక బాధ్యతలు అప్పగించాల్సిందిగా ఆయనే అధిష్ఠానానికి సూచించారని తెలుస్తోంది. ఈటల రాజేందర్ కూడా శుక్రవారం అసోం రాజధాని గువాహటికి చేరుకుని హిమంతతో రహస్య మంతనాలు జరిపారు. నిజానికి ఆయన ఢిల్లీకి వెళ్తున్నట్టు ప్రచారం జరిగినప్పటికీ.. ఆయన గువాహటికి వెళ్లినట్టు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. అధిష్ఠానం చర్చలు ఒక కొలిక్కి వచ్చిన నేపథ్యంలో.. తెలంగాణలో నాయకత్వ మార్పులకు సంబంధించి ఏ క్షణమైనా కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. అలాగే.. నాయకత్వ మార్పులు జరిగితే పార్టీ నిలదొక్కుకోవడానికి సమయం పడుతుంది కాబట్టి.. తెలంగాణ ఎన్నికలు జనవరి మొదటివారంలో జరిపే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలు 2018 డిసెంబరులోనే జరిగినప్పటికీ.. కేసీఆర్‌తో సహా ఎమ్మెల్యేలంతా 2019 జనవరి 17న ప్రమాణ స్వీకారం చేశారు కాబట్టి, జనవరి 16లోపు ఎన్నికల ఘట్టం ముగించేందుకు అవకాశం ఉన్నదని రాజ్యాంగ నిపుణులు సలహా ఇచ్చినట్టు తెలుస్తోంది. అలా జనవరిలో ఎన్నికలు జరిపితే..ఈటల బృందానికి ఎన్నికల వ్యూహాలను అమలు చేయడానికి నెల సమయం అదనంగా లభిస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

మూడు ప్రతిపాదనలు..: తెలంగాణలో బీజేపీ విజయావకాశాలను మెరుగుపరిచేందుకు అధిష్ఠానం 3 ఫార్ములాలను పరిశీలించిందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. అవి..

1. బండి సంజయ్‌ను పార్టీ అధ్యక్షుడుగా కొనసాగిస్తూనే ఈటలకు పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ సారథ్యంతో పాటు అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషించేందుకు వీలు కల్పించడం.

2. పార్టీ వ్యవహారాలను, ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ బాధ్యతలు.. రెండింటినీ బయటి నుంచి వచ్చిన నేతలకే అప్పగించి, పార్టీని గెలుపు దిశగా తీసుకువెళ్లేందుకు పూర్తి అధికారాలు వారికే ఇవ్వడం. ఇందులో భాగంగానే.. పార్టీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు పార్టీ అధ్యక్ష పదవిని, ఈటల రాజేందర్‌కు పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ బాధ్యతను అప్పగించే ప్రతిపాదన వచ్చింది.

3. పార్టీ అధ్యక్ష పదవిని ఈటల రాజేందర్‌కే అప్పగించి, ఎన్నికల కమిటీలను నియమించే స్వేచ్ఛ ఆయనకే కల్పించడం.

అయితే, డీకే అరుణకు పార్టీ అధ్యక్షురాలి పదవి, ఈటలకు ప్రచార కమిటీ చైర్మన్ ఇచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ఏది ఏమైనా మూడు ఫార్ములాల్లో ఈటలకే రాష్ట్ర బీజేపీలో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అభ్యర్థుల ఎంపికలో ఆయనకే స్వేచ్ఛ ఇవ్వాలని బీజేపీ అంధిష్ఠానం నిర్ణయించినట్లు అర్థమవుతోంది. కేసీఆర్‌ను వ్యూహాల గురించి బాగా తెలిసిన వ్యక్తి కావడం వల్ల.. ఈటల ఆయన్ను బలంగా ఢీకొనేలా పదునైన వ్యూహరచన చేయగలు గుతారని భావించడమే ఇందుకు కారణం. ఈక్రమంలోనే.. 2013లో మోదీని ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించి, ఆయననే ప్రధాని అభ్యర్థిగా రంగంలోకి దించినట్లు.. ఈటలను కూడా ప్రచార కమిటీ చైర్మన్‌గా రంగంలోకి దించి, ఆయనకే సీఎం అయ్యే అవకాశాలు కల్పించాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నట్లు ఒక వర్గం చెబుతోంది.

చేప మందు ప్రసాదం పంపిణీ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుందన్నారు. చేప ప్రసాదం పంపిణీ కోసం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దాదాపు 32 క్యూలైన్లను ఏర్పాటు చేశామని, చిన్నపిల్లలకు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. చేప మందు కోసం దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఉబ్బస వ్యాధిగ్రస్తులు ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి చేరుకున్నారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి 10 అర్ధరాత్రి వరకు ఎగ్జిబిషన్ గ్రౌండ్, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. అలాగే చేప మందు వచ్చే ప్రయాణీకుల కోసం 9, 10వ తేదీలలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్, జేబీఎస్, ఎంజీబీఎస్, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్, శంషాబాద్ ఎయిర్ పోర్టు వంటి ప్రాంతాల నుంచి దాదాపు 50 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతల నుంచి 80 బస్సులు ఏర్పాటు చేశారు.

తొమ్మిదేళ్లలో సీన్ రివర్స్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి హరీశ్‌రావు యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. తెలంగాణ వస్తే ఏమొస్తదన్న వారు.. ఏమి వచ్చిందో ఆసరా పెన్షన్ పొం దుతున్న వృద్ధులను అడిగి తెలుసుకోవాల న్నారు. పేద ప్రజల పుట్టక నుంచి చావు దాకా సంక్షేమ పథకాలకై ఆలోచిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియాడారు. గతంలో ప్రతి వార్డుకు ఒక నీళ్ల ట్యాంకరు వస్తే బిందెలు పట్టుకొని వెళ్లేవారని, కానీ నేడు ఇంటింటికీ నల్లాల ద్వారా ప్రతిరోజు తాగునీరు వస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బాగు చేయడం మూలంగా, ప్రైవేటు ఆసుపత్రులు మూలన పడే పరిస్థితులు సిద్దిపేటలో నెలకొన్నాయని చెప్పారు. గర్భిణులకు అందించే న్యూట్రి షన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 14న జిల్లాలో ప్రారంభించబోతున్నామని హరీశ్‌రావు తెలిపారు. సగౌరవంగా అంతి మ కార్యక్రమాలు నిర్వహించేందుకు వైకుం ఠధామాలను నిర్మించామని, పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు ప్రతి సందర్భంలో ప్రజల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. సిద్దిపేట అభివృద్ధిని, కోమటి చెరువును చూసేం దుకు ఇతర జిల్లా, రాష్ట్రాలకు చెందిన వారు వస్తున్నారని, ఇది సిద్దిపేట బిడ్డగా మనమంతా గర్వించదగ్గ విషయమని స్పష్టం చేశారు. ఈనెల చివరిలోగా కోమట చెరువులో డైనోసార్ పార్కు ను ప్రారంభిం చుకోనున్నట్లు తెలిపారు. తడి, పొడి, హానికర చెత్తను వేరు చిసి ఇవ్వడంతో స్వచ్ఛసిద్దిపేటను సాధించుకోబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ఎ ర్సన్ మంజులారాజనర్సు, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరాం, మున్సి పల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. వంచించి.. హతమార్చాడు

(మొదటి పేజీ తరువాయి)

ముందుండి నడిపించాడు. సినీఫక్కీలో జరిగిన ఈ ఘటనను మూడు రోజుల్లోనే ఛేదించారు శంషాబాద్ జోన్ పోలీసులు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాల ప్రకారం.. ఏపీలోని అంబేద్కర్ కోన సీమ జిల్లా పీ గన్నవరం మండలం నరేంద్ర పురానికి చెందిన అయ్యగారి వెంకట సూర్య సాయికృష్ణ సరూర్‌నగర్‌లోని వెంక టేశ్వర కాలనీలో నివాసముంటున్నాడు. స్థానికంగా మైసమ్మ దేవాయంలో పూజారి గా ఉంటూనే భవన నిర్మాణ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి భార్య, కూతురు ఉన్నారు. ఇదిలా ఉండగా చెన్నైకి చెందిన కురుగంటి అప్పర (30) తన తల్లితో కలిసి నిరుడు ఏప్రిల్‌లో నగరానికి వచ్చి ఇదే కాలనీలో నివాసముం టున్నది. గతంలో పలు సినిమాలు, సీరియ ల్స్‌లో చిన్న పాత్రల్లో నటించిన అప్సర ప్రస్తు తం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నది.

భక్తురాలిగా పరిచయమై..

పూజారి సాయికృష్ణ పని చేసే ఆల యాని కి వచ్చే క్రమంలో అప్సరకు అతడితో ఏర్ప డిన పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరు శారీర కంగా దగ్గరయ్యారు. దీంతో తనను వివాహం చేసుకోవాలని అప్సర తరచూ సాయికృష్ణపై ఒత్తిడి తీసుకురా వటం మొదలు పెట్టింది. ఎలాగైనా అప్సం ను వది లించుకోవాలని సాయికృష్ణ నిర్ణయించుకు న్నాడు. పథకం ప్ర కారం 3న కోయంబ త్తూరుకు వెళ్దామని చెప్పి అప్సం ను కారులో తీసుకెళ్లాడు. రాత్రి 11 గంట ల సమయంలో శంషాబాద్ మండలం లోని సుల్తాన్‌పల్లి శివారులోని గోశాల వైపు సీసీ కెమెరాలు లేని ప్రదేశానికి చేరుకున్నాడు. కారులోనే గాఢనిద్రలో ఉన్న అప్సర ముఖంపై కారుపై కప్పే కవర్‌తో ఊపిరి ఆడకుండా చేసేందుకు యత్నించాడు. ప్రతి ఘటించడంతో వెంట తెచ్చుకున్న బెల్లం కొట్టే రాయితో తలపై కొట్టడంతో అక్కడి క్కడే మృతి చెందింది.

**డ్రైనేజ

తెలంగాణ వచ్చిన తర్వాత అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతున్న రాష్ట్రం

హోంమంత్రి మహమూద్ అలీ

అంబర్ పేట, జూన్ 9: (వాయిస్ టూ డే): దేశం మొత్తం మీద ఏ రాష్ట్రంలో ఇవ్వనటువంటి సంక్షేమ పథకాలను ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనని దళిత బంధు, రైతుబంధు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్ల ద్వారా కొన్ని కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని హోం మంత్రి మొహమ్మద్ అలీ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇవాళ ' గిరిజనాభివృద్ధి– ప్రగతి నివేదిక" ను జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంబర్పేటలో సంబరాలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి హోం మంత్రి మహమ్మద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు దూసరి లావణ్య, విజయ్ కుమార్ గౌడ్ మరియు అంబర్పేట్ ఎమ్మార్వో లలిత, అధికారులు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

వడ్డీ లేని రుణాల్లో భాగంగా అంబర్ పెట్ నియోజకవర్గ పొదుపు సంఘాలకు మంజూరు చేసిన ఒక కోటి ఆరు లక్షల రూపాయల చెక్కులను మహిళలకు అందజేశారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక ప్రయోజనంగా ఉంటుందని ప్రవేశపెట్టి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేసిన హోంమంత్రి మహమూద్ అలీ తెలంగాణ వచ్చిన తర్వాత అభివృద్ధి లో ముందుకు దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రం లో వనరులను చూసి ఐటీ, ఇండస్ట్రీ సెక్టార్ లు మన రాష్ట్రంలో నెలకొల్పుతూ లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు దొరికాయి అన్నారు.10 రకాల పెన్షన్ లను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని తెలంగాణ రాక ముందు 200 రూపాయల పెన్షన్ కి వివిధ రకాల ఇబ్బందులు గురిచేసేవారు ఇప్పుడు సులువుగా వారివారి బ్యాంక్ లలో జమ అవుతున్నాయి అని హోం మంత్రి మహమ్మద్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఎర్రబోలు నరసింహారెడ్డి గెలువయ్య, శ్రీరాములు, దూసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వరాష్ట్ర పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచింది

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి

ఉప్పల్, జూన్ 9 (వాయిస్ టుడే ప్రతినిధి):– తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సంక్షేమ సంబరాలకార్యక్రమం రామంతపూర్ డివిజన్లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ రంగానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని 9 ఏళ్ల స్వరాష్ట్ర పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని తెలిపారు. ఆసరా పెన్షన్లు, రైతుబంధు, దళిత బంధు, వంటి సంక్షేమ పథకాలు పేద ప్రజల ఆర్థిక స్వవలంబన కల్పించే దిశగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆసరా పెన్షన్ కార్డులు, కాప్రా, ఉప్పల్ మండలానికి చెందిన 414 కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు,బీసీ కుల వృత్తుల వారికి మొదటగా ఐదుగురు కుల వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఇన్చార్జ్ నోడల్ ఆఫీసర్ , ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కుమార్ అరుణకుమారి, ఉప్పల్ మండల ఎమ్మార్వో శ్రీ గౌతమ్ కుమార్, ఉప్పల్ మండల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, కార్పొరేటర్లు శాంతి సాయి జన శేఖర్, పన్నాలా దేవేందర్ రెడ్డి, జేరిపోతుల ప్రభుదాస్, ఉమెన్స్ చైల్డ్ వెల్ఫేర్ ఇంచార్జ్ సి పి డి ఓ స్వర్ణలత, మైనార్టీ వెల్ఫేర్ ఇంచార్జ్ సౌజన్య, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఇన్చార్జి తిరుపతయ్య, బీసీ వెల్ఫేర్ ఇంచార్జ్ రవీందర్, ఎస్సీ వెల్ఫేర్ ఇంచార్జ్ సుధాకర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఇన్చార్జి వంశీ, సుధాకర్, ప్రాజెక్ట్ ఆఫీసర్స్ శ్రీనివాస్, రమాదేవి, ఎస్ డబ్ల్యూ డి ఈ చందన , శానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్, కాప్రా రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆనంద్, ఉప్పల్ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ సుధా, రెవిన్యూ సిబ్బంది,టిఆర్ఎస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,మహిళలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మరొక్కసారి బీసీల కులాల మధ్యనే చిచ్చురు రేపడానికి ప్రయత్నిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

విద్యానగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ మరొక్కసారి బీసీలను మోసం చేయటానికే బీసీల అభివృద్ధికి ఎదో పాటుపడుతున్నట్లుగా బీసీలకు లక్ష రూపాయల పథకాన్ని ప్రకటించి బీసీలలో 130 కులాలు ఉండగా కేవలం 6 బీసీ కులాలకు 100 కోట్ల రూపాయలను కేటాయించి బీసీల కులాల మధ్యనే చిచ్చురు రేపడానికి ప్రయత్నిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు.. విద్యానగర్లోని బీసీ భవన్లో బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ కులాలకు లక్ష రూపాయల పథకాన్ని వర్తింప చేస్తున్నామని ప్రకటించినప్పుడు రాష్ట్రంలోని 132 కులాలలో 62 లక్షల కుటుంబాలకు ఇస్తారని దీనికోసం ఒక పదివేల కోట్లు కేటాయిస్తారని ఆశపడగా బీసీలను మరొకసారి మోసం చేసి కేవలం 100 కోట్ల రూపాయల కేటాయించి చేతులు దులుపుకున్నారని ఆర్ కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు..

కేవలం 100 కోట్ల రూపాయల నిధులతో 62 లక్షల బీసీ కుటుంబాల్లో చిచ్చు పెట్టడానికి ప్రయత్నం చేస్తుందని గడిచిన తొమ్మిది సంవత్సరాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అడుగడుగునా మోసం చేసిందని బీసీ కార్పొరేషన్ ద్వారా ఒక్క బీసీ కూడా రుణాలు మంజూరు చేయలేదని, 2016 –17 సంవత్సరంలో 3లక్షల అరవై ఐదు వేల దరఖాస్తులు స్వీకరించి ఒక్కరికైనా రుణాన్ని మంజూరు చేశారా అని, గత ఎన్నికల సమయంలో కూడా రుణాలు ఇస్తామని దరఖాస్తుల స్వీకరించి వాటిని మూలకు పడేశారని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంకా ఎన్ని సంవత్సరాలు ఇలా మోసపూరిత హామీలతో పబ్బం గడుపుతారని, ఎలక్షన్ల వరకు బీసీల జపం చేసి ఎలక్షన్లు ముగిసిన వెంటనే బీసీలను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఇది ముఖ్యమంత్రి కేసీఆర్ నైజం అని మండిపడ్డారు.. ఈ సమావేశంలో ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, రాజేందర్,వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్ జూన్ 9 (వాయిస్ టుడే): జూబ్లీహిల్స్ శాసనసభ్యులు భారత రాష్ట్ర సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ తెలంగాణ రాష్ట్ర అవతరణదినోత్సవంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో దళితబంధు లబ్ధిదారులతో కలిసి యూసుఫ్ గూడ డివిజన్ యూసుఫ్ గూడ బస్తీలోలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపినాథ్ మాట్లాడుతూ భారత రత్న, రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఒక ప్రముఖ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త. అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేసారని, ముఖ్యమంత్రి కేసీఆర్ నూతనంగా నిర్మిస్తున్న తెలంగాణ సచివాలయానికి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి పేరు పెట్టడం చాల గొప్ప విషయం అంబెడ్కర్ గారి ఆశయం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ గారు తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు రాజకుమార్ పటేల్, దేదీప్య రావు, సి ఎన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సంజీవ, సంతోష్, కృష్ణ మోహన్, నాయకులు.. నర్సింగ్ దాస్. మాదాస్ వేణుగోపాల్. విజయకుమార్, నర్సింగ్ దాస్, విజయసింహ, సత్యనారాయణ, వేణుగోపాల్, శ్రీను, కళ్యాణి, ఖైసర్ జహాన్, ఆదిలక్ష్మి, గీత గౌడ్, అరుణ, స్రవంతి, మాధవి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుల పట్ల ఎందుకంత వివక్ష

లక్ష రూపాయల రుణం ఇచ్చేందుకు వెనుకడుగు

గోనెల కుమారస్వామి ముదిరాజ్

జూబ్లీహిల్స్ జూన్ 9 (వాయిస్ టుడే) : తెలంగాణ ప్రభుత్వం ముదిరాజుల పట్ల ఎందుకంత వివక్ష చూపుతుందో సమాధానం ఇవ్వాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమారస్వామి ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన శుక్రవారం మాట్లాడారు. బీసీలకు లక్ష రూపాయల రుణమిస్తున్నట్లు ప్రకటించిన తెలంగాణ సర్కార్ ఆ జాబితాలో ముదిరాజులను చేర్చకపోవడం సరికాదని అన్నారు. చేపల పంపిణీలో కూడా ముదిరాజులకు వివక్ష ఎదురైందని విమర్శించారు. రుణాలకు దరఖాస్తు చేసుకునే సమయాన్ని తక్కువగా ఇచ్చి బహుజనులను అవమానించే విధంగా ప్రభుత్వం వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. ఇది ముదిరాజుల పట్ల బహుజనుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్న చూపును సూచిస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలన్నారు. ముదిరాజులను బీసీ – డి నుంచి బీసీ – ఏ జాబితాలోకి చేర్చే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు సూచనలను పెడచెవిన పెట్టేలా ప్రభుత్వం వ్యవహరించడం అన్యాయం అన్నారు. తెలంగాణలో రాష్ట్రంలో ముదిరాజుల జనాభా 50 లక్షలకు పైగా ఉందన్నారు. అటువంటి ముదిరాజులను రాజకీయంగా, సామాజికంగా బలహీనపరిచేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని అనుమానాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ చిత్తశుద్ధి నిరూపించుకునేందుకుముదిరాజులకు ఫెడరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు కేటాయించాలని సూచించారు. తమ కులస్తులకు న్యాయం జరిగే వరకూ ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు అల్లాదుర్గం సురేష్,ప్రధాన కార్యదర్శి బాలుగారి నరసింహులు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ముదిరాజులకు చట్టపరంగా రావాల్సిన హక్కులను సాధించుకుంటామని అన్నారు. తమకు ప్రాధాన్యం కల్పించే రాజకీయ పార్టీలకు మద్దతు ఇస్తామన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలని చూస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ముదిరాజు లను ఏక తాటిపైకి తెచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కుమారస్వామి ముదిరాజ్ తెలిపారు.

పై స్కూల్‌ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్

పిర్జాదిగూడ, జూన్ 10 (వాయిస్ టుడే):పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్లో ఫస్ట్ క్రై ఇంటలి టట్స్ ప్రై స్కూల్ ప్రారంభించిన డిప్యూటీ మేయర్ కుర్ర శివ గౌడ్, పప్పులు అంజి రెడ్డి, కార్పొరేటర్ కవుడే పోచయ్య, దిందిరి హరి శంకర్ రెడ్డి, మరియు కార్యకర్తలు మహిళలు, స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.

సెయింట్ స్టీఫెన్స్ గ్లామర్ హై స్కూల్ ప్రారంభోత్సవంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి

పిర్జాదిగూడ, జూన్ 10 (వాయిస్ టుడే): ఫిర్యాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నూతనంగా ఏర్పాటు చేసిన సెయింట్ స్టీఫెన్ గ్లామర్ హై స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బలగం సినిమా నటీనటులతో మరియు గ్రంధాలయ చెర్మన్ దర్గా దయాకర్ రావు , స్కూల్ యాజమాన్యం ప్రిన్సిపాల్ రమేష్, సింగర్ మమత తో కలసి పాల్గొని వారు మాట్లాడుతూ మనం మన పిల్లలు ఉన్నత స్థానంలో ఉండాలన్న చదువు ప్రథమం అని చదువుకుంటే ఎన్నో మన తల్లితండ్రుల ఆశయాలను సాధించుకోవచ్చని అలాంటి మంచి విద్య బోధనను అందించే గల స్కూల్ సేంట్ స్టిపెన్ గ్లామర్ హై స్కూల్ అని స్కూల్ ను స్కూల్ యాజమాన్యన్ని కొనియాడి పాఠశాల నిర్వహకులకు శుభాకాంక్షలు తెలియ జేశారు ఈ కార్యక్రమము లొ భాగంగా స్కూల్ చెర్మన్ రమేష్ బలగం సినిమా ఆర్టిస్ట్ లకు, మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మరియు దర్గా దయాకర్ రావు కి బొకేలను అందించి శాలువాలతో సత్కరించారు. బలగం మూవీ ఆర్టిస్ట్ లను చూడడానికి పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు ప్రజలు తరలివచ్చారు.

అంబర్ పెట్ డివిజన్ హైమద్ నగర్‌లో పర్యటించిన అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్

అంబర్ పెట్:– జూన్ 9:(వాయిస్ టూ డే): అంబర్ పెట్ డివిజన్ హైమద్ నగర్ లో పర్యటించిన అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక బస్తి ప్రజలతో కలిసి కలుషిత మంచినీటి సమస్యను పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వెనువెంటనే సమస్యని పరిష్కరించాలని వారికి తెలియజేయడం జరిగింది, అప్పటివరకు వారికి తాగునీటికి ఇబ్బంది లేకుండా ట్యాంకర్ ద్వారా మంచినీరు సప్లై చేయాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో స్థానిక బస్తి ప్రజలు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్ ముదిరాజ్,మహమ్మద్ రఫిక్,రాజ్ కుమార్,సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబు చౌదరి కుటుంబ సభ్యుల పరామర్శించిన సినీ నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్

కూకట్పల్లి: హౌసింగ్ బోర్డ్ కాలనీ సర్దార్ పటేల్ నగర్ లోని బాలాజీ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మందలపు సాయిబాబు చౌదరి ఇంటికి శుక్రవారం సినీ నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్ వచ్చారు. ఇటీవల సాయిబాబు చౌదరి సతీమణి రోజా దేవి గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ఆయన ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సాయిబాబు చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. రోజా దేవి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

బీఎస్సీ ఫారెస్ట్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, జూన 9 : కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చర్ యూనివర్సిటీకి అనుబంధంగా సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ (ఎఫ్సీఆర్ఐ)లో బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ సీట్లను టీఎసఎంసెట్–2023 ర్యాంకుల ఆధారంగా భర్తీ చేస్తారు. ఈ కోర్సులో ప్రవేశాలు పొందాలంటే పీసీబీ, పీసీఎం, పీసీఎంబీ సబ్జెక్టులు చదివి ఉండాలి. ఇంటర్మీడియట్ లేదా 10ం2 చదివిన విద్యార్థులు ఈ కోర్సు చదివేందుకు అర్హులు. ఈ మేరకు దరఖాస్తు ఫీజును ఎస్సీ, ఎస్టీ, పీహెచ విద్యార్థులకు రూ.1,000, బీసీ, జనరల్ విద్యార్థుల రూ.2,000లుగా నిర్ణయించారు. ఈ నెల 14 నుంచి జూలై 12 వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా, ఆ తర్వాత రూ. 500 ఆలస్య రుసుముతో జూలై 15 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది.

వాయిస్ టుడే
జనగాత్రం - మనసేత్రం
హైదరాబాద్
శనివారం 10 జూన్ 2023

21,40వ డివిజన్ లలో సిసి రోడ్డు డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేసిన బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ నగర మేయర్ యాదగిరి సునీల్ రావు మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ డివిజన్ కార్పొరేటర్ కోటగిరి భూమి గౌడ్, జంగిలి సాగర్, బోనాల శ్రీకాంత్,బారసా నగర అధ్యక్షులు చల్ల శంకర్ మరియు మున్సిపల్ అధికారులు కాలనీవాసులు పాల్గొన్నారు. - కరీంనగర్ (వాయిస్ టుడే)

ఒరిస్సా వలస కూలీలకు అన్నదానం...!

పెద్దపల్లి జిల్లా: (వాయిస్ టుడే న్యూస్) గోదావరిఖని న్యాయవాది కూచన శ్రీనివాస్ తండ్రి ద్వితీయ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం. మార్కండేయ కాలనీకి చెందిన న్యాయవాది కూచన శ్రీనివాస్ వారి తండ్రి కీర్తిశేషులు కూచన మోహన్ రావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని గంగానగర్లో నివసిస్తున్ననిరుపేద ఒరిస్సా వలస కూలీలకూ పోషకాహారంతో కూడిన అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు ఖాజా నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్, దాత కుచన శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ ఇచ్చిన మాట అమలు చేయాలి

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ ఘాటు విమర్శ

పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా కేసిఆర్ శ్రీరాంపూర్ లో ఇచ్చిన వాగ్దానాలు వెంటనే అమలు చేయాలి డిమాండ్...(ఏమిటో చూద్దాం)

ఆ డిమాండ్లలో కొన్ని,,

1. సింగరేణి కార్మికుల సొంత ఇంటి కలను నెరవేర్చడంలో భాగంగా వారికి రెండు గుంటల భూమి ఇవ్వాలని,
2. మారుపేర్లపై పనిచేసే కార్మికులకు వారి సొంత పేర్లపై రెగ్యులరైజ్ చేయాలని,
3. నూతన ఆరు అండ్రౌండ్ గనులను ఓకే రిమోట్ బటన్ నొక్కి ఇంకా ప్రారంభానికి నోచుకొలేని గనులను ప్రారంభించాలని,
4. సింగరేణి కార్మిక ఉద్యోగ డిపెండెంట్ల వయసును 40సంవత్సారాలకు పెంచాలని,
5. కార్మిక కుటుంబాలకు మిషన్ భగీరథ నీళ్లను సరఫరా చేయాలని,
6. సింగరేణికి, విద్యుత్ సంస్థల నుండి రావాల్సిన దాదాపుగా 22వేల కోట్ల రూపాయల బకాయిలను వచ్చే విధంగా ఆ సంస్థల అధికారులను ఆదేశించాలని,
7. వారసత్వ ఉద్యోగాల్లో అందరికీ అవకాశం కల్పించాలని,
8. మెడికల్ అన్ ఫిట్ నిబంధనలను(ఒక్క రోజు సర్వీసులో ఉన్నా మెడికల్ బోర్డుకు అర్హులని %డ% మెడికల్ బోర్డ్ బోర్డుకు మధ్యలో సంవత్సరం ఉండాలనే నిబంధన) సడలించాలని కోరడం జరిగింది..

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

గోదావరిఖని (వాయిస్ టుడే న్యూస్): గోదావరిఖని విటల్ నగర్ కు చెందిన సయ్యద్ హఫీజ్ 45 ఎన్టీపీసీ బిహెచ్ఇఎల్ కంపెనీ నందు అంబులెన్స్ డ్రైవర్గా పనిచేయుచున్నాడు మృతునికి భార్య కొడుకు కూతురు ఉన్నారు. రోజులా తన యొక్క డ్యూటీ ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో మున్సిపల్ చౌరస్తా సమీపంలో గల పెట్రోలు బంకు ముందు రాజీవ్ రహదారి మీద అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రోడ్డు దాటుచుండగా అదే సమయంలో అతివేగంగా మంచిర్యాల నుండి కరీంనగర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం డి కొట్టడంతో డ్రైవర్ సయ్యద్ హఫీజ్ కు నడుము కింది భాగం నుండి వాహనం వెళ్ళగా నడుము కింది భాగంలో కుడి కాలికి మరియు తలకు బలమైన గాయాలు అయి అక్కడికక్కడే చనిపోయినాడు. అని మృతుడు సయ్యద్ అఫీజ్ యొక్క భార్య షహనాజ్ 40 సంవత్సరములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించడమైనది

భువనగిరి తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం

భువనగిరి (వాయిస్ టుడే): సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మన్నెసంజీవరావు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ గారి ఆదేశాల మేరకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం మొదటి విడత పూర్తి చేసుకున్నాం త్వరలోనే రెండో విడత ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభించి భువనగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తెలుగుదేశం జెండాను ఎగరవేసి గ్రామంలోని గ్రామ కమిటీని మరియు బూత్ కమిటీలను కూడా ప్రకటించి రాబోవు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అన్నారు తెలుగు రైతు అధికార ప్రతినిధి ఎలిమినేటి సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ గతంలో వివిధ కారణాలవల్ల తెలుగుదేశం పార్టీని వీడిన నాయకులు కార్యకర్తలు తిరిగి రావాలి అని కోరారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబోయిన రమేష్ యాదవ్ వలిగొండ మండల పార్టీ అధ్యక్షులు కల్లూరు నవీన్ కుమార్ పోచంపల్లి మండల పట్టణ పార్టీ అధ్యక్షులు మీసాల నరసింహ లక్ష్మయ్య బోనగిరి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి తెలుగు యువత రేపు బీరప్ప భువనగిరి మండల ప్రధాన కార్యదర్శి కనకరాజు సీనియర్ నాయకులు రత్నపురం నరసింహ మాజీ కౌన్సిలర్ భువనగిరి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ఊపిరిగా సీఎం కేసీఆర్ పాలన: ఎమ్మెల్యే కోరుకంటి చందర్

పెద్దపెల్లి జిల్లా: (వాయిస్ టుడే న్యూస్) గోదావరిఖని. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్జీ-1 పరిధిలోని 11వ బొగ్గు గనిపై ఎమ్మెల్యే చందర్ దశాబ్ది ప్రగతి యాత్ర కొనసాగింది. సింగరేణి కార్మికులు, టీబీజీకేఎస్ నాయకులు స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏరు పడ్డాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించుకోగా, అభివృద్ధి, సంక్షేమంలో మన రాష్ట్రం భారతదేశంలోనే ముందుస్థానంలో నిలవడం ఎంతో గర్వించదగిన విషయమని అన్నారు. ఎంతోమంది యువకులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ఉద్యమంలో పాల్గొని, ప్రాణాలను త్యాగం చేశారని, తత్ఫలితంగానే యావత్ తెలంగాణ స్వేచ్ఛ వాయువులతో జీవిస్తుందన్నారు. ఉద్యమ సారథుడు సీఎం కెసిఆర్ పై నమ్మకంతోనే ప్రజలు ఉన్నారని.. దీంతో సుమారుగా 16 వేల మంది యువత సింగరేణి కార్మికులుగా ఉద్యోగం పొందారని అన్నారు. అంతేకాకుండా మహిళలను సింగరేణి సంస్థలో భాగస్వాములుగా చేసి, లాభాల వాటాను సైతం ఇస్తున్న ఘనత సీఎం కె దక్కిందన్నారు. అన్నారు.

ఖాతాదారులు పంట రుణాలు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలి

పడమటి సోమారం (వాయిస్ టుడే): పాము కాటు ద్వారా మరణించిన అల్వ రాంరెడ్డి గారి భార్య అయిన అల్వ యాదమ్మకు SBI జనరల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ 1000 రూపాయల పథకం కింద 20 లక్షల రూపాయల చెక్కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనటువంటి APGVB భువనగిరి ప్రాంతీయ అధికారి శ్రీ బి. వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ , ఖాతాదారులు పంట రుణాలు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని, ఇతర ఇన్సూరెన్స్ పథకాలైనటువంటి ప్రధానమంత్రి జీవనజ్యోతి మరియు సురక్ష భీమా పథకాల గురించి బ్యాంకు ఖాతాదారులకు వివరించడం జరిగింది .ఈ కార్యక్రమంలో APGVB భువనగిరి FIC నోడల్ ఆఫీసర్ శ్రీ డి .రాజేంద్రప్రసాద్, బీబీనగర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ బి. శంకర్ రెడ్డి, SBI జనరల్ అధికారి శ్రీ వీర కుమార్, పడమటి సోమారం సర్పంచ్ శ్రీ టి. గణేష్ మరియు బీబీనగర్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్ట రక్షణకై ఉద్యమిస్తాం...!

బూడిద గణేష్ (వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి)

గోదావరిఖని(వాయిస్ టుడే న్యూస్) : మంథని మండలం గాజులపల్లి గ్రామంలోని జరుగుచున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలను అధ్యయనం చేయడం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరల వలన ప్రజానీకం అల్లాడుతుంటే కేంద్ర ప్రభుత్వం రోజు కూలి కేవలం 272 రూపాయలు నిర్ణయించడం బాధాకరమని అన్నారు రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని పని దినాలను 200 రోజులకు పెంచాలని కూలీలకు ప్రమాద బీమా కల్పించాలని ఉపాధి హామీ పథకానికి ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజులలో ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి కూలీలంతా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూలీలు చింతం లింగయ్య బడికిల సమ్మయ్య, ఉపేందర్ తొగరి లక్ష్మి, గంగుల రాధమ్మ తదితరులు ఉన్నారు.

శ్రీ చైతన్య కార్పొరేట్ స్కూల్‌లో పిల్లలను చేర్పించకండి

మక్తల్ జూన్ 09 (వాయిస్ టుడే): విద్యార్థి, యువజన, ప్రజా,ఉపాధ్యాయ సంఘాలు మక్తల్‌లో శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాలలో తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పించకండి అని విద్యార్థి, యువజన, ప్రజా ,ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి భాస్కర్ అధ్యక్షత వహించగా విద్యార్థి ,యువజన ,ప్రజా ,ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడడం జరిగింది

ఈ సందర్భంగా మాట్లాడుతూ మక్తల్ కేంద్రంలో శ్రీ చైతన్య పాఠశాలను ఏర్పాటు చేసి మేము విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని అంటున్నారు అయితే ఇప్పటివరకు ఎటువంటి అనుమతులు లేకుండా అబద్దాలు అసత్యాలతో ప్రచారాలు నిర్వహిస్తున్నారు అయితే ఇప్పుడు నిర్వహించే ఆ పాఠశాలలో గతంలో డిగ్రీ కాలేజీ కొనసాగుతున్న ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పాఠశాల ఏర్పాటు చేయాలంటే అన్ని రకాల బస్సులతో కూడిన ప్రదేశాలలో చేయాలని ఉంది అయితే ఏమాత్రం

ప్రభుత్వానిబంధనలను పాటించకుండా బ్యానర్లు కట్టి అసత్యాలు ప్రచారం చేసి విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

ఒక నర్సరీ స్టాండర్డ్ కి సంవత్సరానికి 50వేల రూపాయలు ఫీజులు కట్టాలి అంటున్నారు ఎందుకంటే ఆ పిల్లలకు నీటు జేఈఈ ఇలాంటి కోచింగ్లు ఇస్తామని చెబుతూ ఫీజులు దండుకుంటున్నారు ధనార్జన దేయంగా విచ్చలవిడిగా ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థులను మానసికంగా అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారు కాబట్టి ప్రభుత్వం అధికారులు ఇట్లా అబద్ధం ప్రచారాలు చేసే శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనియెడల మా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు

ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర బాధ్యులు మద్దిలేటి, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ బాధ్యులు హైమావతి, టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్, ఎమ్మార్పీఎస్ నాయకులు నగేష్, కే ఎన్ పి ఎస్ నాయకులు విజయ్, బేడ బుడగ జంగం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణం రాజ్, పిడిఎస్యు జిల్లా నాయకులు అజయ్ ,శేఖర్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు

సమైక్యరాష్ట్రంలో అడుగడుగునా సంక్షోభం స్వరాష్ట్రంలో గడపగడపకు సంక్షేమం

ప్రతి కుటుంబంలో వెలకట్టలేని సంతోషం

తెలంగాణ తొమ్మిదేళ్ల సంక్షేమ పథం.. యావత్ దేశానికే సరికొత్త సందేశం

జగిత్యాల జిల్లా ప్రతినిధి (జూన్06,23)వాయిస్ టుడే:తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు తెలంగాణ సంక్షేమ సంబరాల్లో పాల్గొన్న అనంతరం ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన వెనుకబడిన కులవృత్తుల దారులకు 1లక్ష రూపాయల ఆర్థికసాయం కార్యక్రమాన్నిఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ ,రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ రాజేశం గౌడ్ ,లైబ్రరీ చైర్మెన్ చంద్రశేఖర్ గౌడ్ ప్రారంభించినారు.తదుపరి జగిత్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముభారక్ చెక్కులను పంపిణీచేసినారు.ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ సంక్షేమ రంగ చరిత్రలోనే తెలంగాణ అగ్రభాగాన నిలుస్తుంది. మానవీయకోణంలో రూపొందించిన పథకాల పట్ల నేడు దేశమంతటా ఆదరణ వ్యక్తమవుతున్నది.తెలంగాణ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి అన్నారు.తెలంగాణలో హనుమంతుని గుడి లేని ఊరు లేదు.బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకం అందని ఇళ్లు లేదు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లు,కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్,నేతన్న భీమా,గీత కార్మికుల సంక్షేమం, దళిత బంధు,ఆరోగ్య లక్ష్మి పథకం,కంటి వెలుగు, ఇలా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరి ఇంటికి అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచింది తెలంగాణ ప్రభుత్వంమని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం సీఎం కెసిఆర్ నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమాలను సమంగా అమలు చేస్తూ, రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా మార్చింది అన్నారు. మన రాష్ట్రం, నియోజకవర్గం లో అమలు అవుతున్నన్ని పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ, ఆయా పథకాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మంద మకరంద్,ఆర్డీఓ మాధురి ,మున్సిపల్ చైర్మన్లు,ఎంపీపీలు, కౌన్సిలర్లు,సంక్షేమశాఖ ఆధికారులు,మహిళ సంఘాల నాయకులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జన వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అశ్వాపురం, జూన్ 9 :(వాయిస్ టుడే న్యూస్): భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జూన్ 11న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో లక్ష మందితో జరిగే సిపిఐ ప్రజాగర్జన బహిరంగ సభ వాల్ పోస్టర్ ను శుక్రవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపాలనను విస్మరించిన పాలకులకు వ్యతిరేకంగా ప్రజలను మరింత చైతన్య పరిచి తగిన గుణపాఠం చెబుదాం అని అన్నారు. బిజెపి పాలనలో ప్రజలలో అభద్రతాభావం నెలకొందని, ఈ పరిస్థితిలో ప్రజలందరూ ఏకమై ప్రజలకోసం కాకుండా కార్పొరేట్ల కొరకు పనిచేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ కు ప్రజలు నేరుగా సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించాలని సూచించారు. 11 లక్షల ఎకరాల పోడుభూములకు పట్టాలిస్తామని ప్రకటించిన కేసిఆర్ ఇప్పుడు ఆ సంఖ్యను తగ్గించారని, వాస్తవ పరిస్థితిని గ్రహించాలని అన్నారు. దీనిపై అఖిలపక్ష పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. విఓఏల సమస్యలను బహిష్కరించాలని, అందరికీ న్యాయం జరిగేలా ప్రజాపాలన సాగించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ప్రజాపోరు యాత్ర స్ఫూర్తితో, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, పోడు సాగుదారులకు పట్టాలు, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థల పరిరక్షణ ఎజెండాగా కొత్తగూడెంలో జూన్ 11న జరిగే ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, ఆమెర్థ సర్పంచ్ బండ్ల సీతమ్మ, సిపిఐ మండల సహాయ కార్యదర్శిలు, కొండపర్తి ప్రసాద్, రాయపూడి రాజేష్, పోతురాజు ముత్తయ్య, బండ్ల వసంత్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడేలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు

తూప్రాన్, జూన్ 8 (వాయిస్ టుడే న్యూస్): మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్‌కు బ్రతుకుతెరువు నిమిత్తం సిద్దిపేట జిల్లా నుండి వలస జీవిగా వచ్చి గతపది సంవత్సరాల నుండి కాయా కష్టం చేసుకొని జీవిస్తున్న వ్యక్తి గురువప్పగారి సుధాకర్ భార్య మమత వీరికి సంతానం ఇద్దరు ఉన్నారు. భార్య భర్తలు ఇరువురు కష్టపడుతూ కొద్ది గొప్పా సంపాదించుకొని ప్లాట్ తీసుకొని ఇల్లు కట్టుకొని జీవిస్తామనీ ఎంతో ఆశతో 120 గజాల స్థలాన్ని ఆర్డిఓ కార్యాలయ సమీపంలో ఎనిమిది సంవత్సరాల క్రితం తీసుకోవడం జరిగింది. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యక్తులు వారిపై ఇతరుల చేత దాడి చేయిస్తూ ఈస్థలం మాదని దౌర్జన్యంగా బెదిరింపులకు గురి చేస్తున్నారు. గతంలో ఇట్టి విషయంపై పిఎస్ లో సదరు వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఇట్టి భూమిని ఎనిమిది సంవత్సరాల క్రితం కొనుగోలు చేసుకుని, రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్టర్ డాక్యుమెంట్ నెంబర్ 1583. ఇల్లు కట్టుకునే కోణంలో మున్సిపల్ నుండి పర్మిషన్

తీసుకొని, పనులను కొనసాగించి ఇల్లు నిర్మాణం పనులు పూర్తి చేసుకున్నారు.

కానీ కొంతమందినీ వారి ఇంటి మీదికి తోలుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. బాదితుల పక్షణ వివిధ దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఆర్డీవో శ్యాంప్రకాష్, తాసిల్దార్ జ్ఞానజ్యోతి వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలిపారు. వారు వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని తెలిపారు. తూప్రాన్ మండల ఎమ్మార్వో ఆదేశాల మేరకు, రెవెన్యూ అధికారులు ఆర్ ఐ. నాగరాజు వీఆర్ఏ. ఆంజనేయులు వెంటనే స్పందించి సదర్ వ్యక్తి వద్దకు వచ్చి విచారణ చేశారు. మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చుట్టుపక్కల గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ వినూత్న కార్యక్రమం

విలేజి బస్ ఆఫీసర్లకు కిట్లు అందజేత

రాజన్న సిరిసిల్ల/ వేములవాడ, జూన్ 9 (వాయిస్ టుడే) : వేములవాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో వేములవాడ బస్టాండ్ నందు విలేజ్ బస్సు ఆఫీసర్ అనే వినూత్న కార్యక్రమం విసి, అండ్ ఎండి ఆదేశానుసారం ఈరోజు జరుపుకోవడం జరిగింది.ఎమ్మార్వో రూరల్ నక్క శ్రీనివాస్, డిప్యూటీ ఆర్ఎం ఆపరేషన్స్ కరీంనగర్ చందర్ రావు, ముఖ్యఅతిథిగా పాల్గొని విలేజ్ బస్ ఆఫీసర్స్ కు సంబంధించిన కిట్లను ఇచ్చి ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారు ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని చందర్రావు తెలుపుతూ విసి అండ్ ఎండి, చైర్మన్ వచ్చినప్పటి నుండి కూడా చాలా వినూత్న కార్యక్రమాలను చేపడుతూ సంస్థను అభివృద్ధి బాటలో లాభాల బాటలో ప్రయాణించే విధంగా చర్యలు తీసుకుంటూ సిబ్బందిని అధికారులను మోటివేట్ చేస్తూ లాభాల బాటలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు దానిలో భాగంగానే విలేజ్ బస్సు ఆఫీసర్స్ అనే ప్రోగ్రామ్ తీసుకొని ఒక గ్రామం లేదా నాలుగైదు గ్రామాలు కలిపి ఆ గ్రామాలలో నివసించే సిబ్బందికి సంస్థ యొక్క పథకాలు సేవలు అందించే వివిధ రాయితీల గూర్చి గ్రామాలలో ప్రచారం చేసి ఉన్న ఇబ్బందులను తెలుసుకొని అట్టి వాటిని డిపో మేనేజర్ దృష్టికి తీసుకువచ్చి సమస్యలు పరిష్కరించే విధంగా విలేజ్ బస్ ఆఫీసర్ సంస్థకు ప్రజలకు మధ్య వారధిగా పని చేసే విధంగా ఉండాలని కోరారు అలాగే ఎమ్మార్వో నక్క శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమైన డిపార్ట్మెంట్లలో రెవెన్యూలో విఆర్ఏ, పోలీస్ డిపార్ట్మెంట్లో, విలేజ్ పోలీస్ ఆఫీసర్ ని ప్రజలకు చేరువ కావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయడం జరిగింది అటువంటి ఏర్పాటు ఈరోజు ఆర్టీసీలో కూడా చేయడం చాలా శుభ పరిణామం అని దానిని పూర్తిస్థాయిలో గ్రామల ప్రజలు ఉపయోగించుకొని సంస్థను అభివృద్ధి పథంలో నిలపాలని లాభాల బాటలో పయనిస్తున్న వేములవాడ డిపో సిబ్బందికి అధికారులకు శుభాకాంక్షలు అభినందనలు తెలిపినారు, డిపో మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వేములవాడ డిపో పరిధిలోని ఆరు మండలాలలో 64 గ్రామాలు ఉండగా 15 మంది విలేజ్ బస్సు ఆఫీసర్ను నియమించడం జరిగిందని ప్రజలకు మరింత చేరువై సంస్థ పథకాలను సేవలను ప్రజలకు వివరిస్తూ సంస్థ ఇంకా అభివృద్ధి పథంలో సాగే విధంగా దోహదం చేయాలని వీరంతా కూడా తమ రెగ్యులర్ డ్యూటీలు అయిపోయిన తదుపరి వాలంటీర్ గా చేస్తారని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో ఎస్ టి ఐ వర్జిలాల్, ఏఎంఎఫ్ రామచంద్ర శ్రీనివాస్ యాదవ్,అంజి డిపో సిబ్బంది పాల్గొన్నారు.

కడియం కే టికెట్.. పోరుకు సిద్ధం కండి

జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు మారుజోడు రాంబాబు

రఘునాధపల్లి,జూన్ 9,(వాయిస్ టుడే). ఈసారి టికెట్ కడియం కే వస్తుంది ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు మాజీ జడ్పిటిసి మారుజోడు రాంబాబు కడియం యువసేన సభ్యులకు మరియు సోషల్ మీడియా ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఏఎస్ఆర్ గార్డెన్ లో జరిగిన కడియం యువసేన సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ....సోషల్ మీడియా ప్రతినిధులు రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చురుకుగా పాల్గొనాలని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఆరు నూరైనా ఈసారి టికెట్ కడియం కేనని స్టేషన్గన్పూర్ ఎమ్మెల్యే గా కడియం శ్రీహరి ఉంటాడని కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని మిగతావారి లాగా పార్టీ పదవులను టికెట్లను, అభివృద్ధి పనులను సైతం అమ్ముకునే చరిత్ర కడియంకు లేదని అన్నారు. కడియం యువసేన మండల అధ్యక్షుడు వడ్లకొండ శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ మల్కాపురం లక్ష్మయ్య, రైతు మండల కోఆర్డినేటర్ బానాజీ పేట సర్పంచ్ గొరిగ రవి భాగ్య,భూక్యా హుస్సేన్, చెంచు రమేష్, గైని శ్రీనివాస్ సర్పంచులు సురేందర్ రెడ్డి, ఉత్తెపు సత్యనారాయణ, ఉమారాణి, గడ్డమీది సంధ్య కిరణ్, కొంకీస్ ప్రకాష్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, దొరగొళ్ల ఐలయ్య, శివరాత్రి కొమురయ్య, వెంకట్ నాయక్, సీతారాం , దేవర యాకయ్య, పెదగొని రాజు, ఎదునూరి గట్టేశం, నానాజీ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాం

ఆర్థికంగా బలమైన రాష్ట్రం తెలంగాణ

దశాబ్ది వేడుకలను గర్వంగా జరుపుకుంటున్నాం

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు
బోయిన్ పల్లి వినోద్ కుమార్

రాజన్న సిరిసిల్ల /వేములవాడ, జూన్ 9 (వాయిస్ టుడే)

శుక్రవారం వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో స్థానిక శాసన సభ్యులు చెన్నమనేని రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన సంక్షేమ సంబరాలు కార్యక్రమానికి బోయినిపల్లి వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా బలమైన రాష్ట్రమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్ పల్లి వినోద్ కుమార్ అన్నారు.తెచ్చిన అప్పుకు అనేక రేట్ల సంపదను ప్రభుత్వం సృష్టిస్తున్నందునే అప్పులు ఇచ్చేందుకు సంస్థలు, బ్యాంకులు ముందుకు వస్తున్నాయని ఆయన అన్నారు.పతారా ఉంది కాబట్టే అప్పు పుట్టిందన్న విషయాన్ని విమర్శకులు గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు.ప్రభుత్వం అప్పులు తెచ్చిందని కొంతమంది అవాకలు చివాకులు పేలుతున్నారని అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తెచ్చిన అప్పులను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణానికి ,గోదావరి ,కృష్ణ నది జలాలను ఎత్తిపోసేందుకు , ప్రాజెక్టుల నిర్మాణానికి మాత్రమే వెచ్చించామని ఆయన తెలిపారు.

ఫలితంగా తెలంగాణలో సంపద సృష్టి అనేక రేట్లు పెరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే సానుకూల ఫలితాలను ప్రజలు అనుభవిస్తున్నారని అన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రజలకు కరువంటే తెల్వదని ఆయన వ్యాఖ్యానించారు. దశాబ్ది ఉత్సవాలపై మీ అభిప్రాయం ఏంటని ఓ జర్నలిస్టు ప్రశ్నించాడు అన్న ఆయన దశాబ్ది ఉత్సవాలను గర్వంగా జరుపుకుంటున్నామని తాను సమాధానమిచ్చానని తెలిపారు. ఈ దశాబ్ది ఉత్సవాల సమయంలోనే వచ్చే పదేళ్లకు సమాలోచనలు చేస్తామని , ప్రణాళికలు రూపొందించుకుంటామని ఆయన అన్నారు. వచ్చే పదేళ్లలో పుష్కలంగా పైసలు ప్రభుత్వం వద్ద ఉంటాయని పేద ప్రజల సంక్షేమానికి ఆ పైసలు వెచ్చిస్తామని ఆయన తెలిపారు.సమైక్య రాష్ట్రంలో కేవలం 3 ప్రభుత్వ వైద్య



కళాశాల లు మాత్రమే ఉండేవని ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి ,కరీంనగర్లలో ఒక్కో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కళాశాలతో పాటు ఒక్కో జిల్లాలో 500 పడకల ఆసుపత్రి నిర్మాణం కూడా చేపడుతున్నామని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలోనే కేసిఆర్ దళిత బంధుకు ఆలోచన చేశారని అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు.సంక్షేమ సంబురాలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి శ్రీకారం చుట్టారన్నారు.

గతంలో లాగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములు భూస్వాముల చేతుల్లో లేవని బీసీలు, ఎస్సీలు ,ఎస్టీలు, సన్న ,చిన్న కారు చేతుల్లోకి వచ్చిందని బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. సీలింగ్ చట్టాలు, సామాజిక ఉద్యమాలు ద్వారా సన్న, చిన్న కారు రైతుల్లో ఈరోజు భూమి ఉందన్నారు . వెనుకబడిన తరగతులకు మేలు జరగాలని సీఎం కేసీఆర్ రైతుబంధు పెట్టడం జరిగిందన్నారు.స్థానిక శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి ఫలాలను సుపరిపాలన ద్వారా ప్రభుత్వ అందిస్తుంది అన్నారు. రైతుబంధు మాదిరే బీసీ కుల వృత్తులకు ఆర్థిక సహాయం పథకం కూడా కొనసాగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల్లోని ప్రతి పేద వ్యక్తికి అందే వరకు కుల వృత్తులకు ఆర్థిక సహాయం కొనసాగుతుందన్నారు. ఉద్యమ సారధి కేసీఆర్ , కే టి ఆర్ దార్శనికతతోనే తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నదని అన్నారు.సంక్షేమ సంబరాలలో 6 మంది బీసీ లబ్ధిదారులకు బీసీ కులవృత్తులకు చేయూత పథకం ద్వారా ఒక్కొక్కరికి లక్ష రూపాయలు అందజేశారు.గొర్రెల యూనిట్ల పథకం ద్వారా 24 మందికి లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందజేసి రెండో విడత కార్యక్రమాన్ని నియోజకవర్గంలో లాంఛనంగా ప్రారంభించారు. మైనార్టీ సంక్షేమ శాఖ నుంచి ఇద్దరికీ స్కీం ల మంజూరు యూనిట్ లను అందజేశారు. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద నియోజకవర్గంలోని మండలానికి ఇద్దరికి చొప్పున 18 మందికి ఆర్థిక సహాయం అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 6 మంది లబ్ధిదారులకు స్కీం మంజూరు ఉత్తర్వులను అందించారు.అలాగే కొనరావుపేట ,మేడిపల్లి మండలాలు చెందిన నలుగురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు.జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రాష్ట్ర పవర్ లూం, టెక్స్ టైల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్‌కు బయలుదేరిన కరాటే టీమ్

మక్తల్ జూన్ 09 (వాయిస్ టుడే): 2వ జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ జూన్ 11 తారీఖున గాజువాక విశాఖపట్నం లో జరుగుతున్న జాతీయ స్థాయి కరాటే పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం జరిగింది. ఆ విద్యార్థులకు డ్రాగన్ చోటు ఖాన్ కరాటే డు స్పోర్ట్స్ వ్యవస్థాపకులు సలాం బిన్ ఉమర్, మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్ గాజువాక ప్రాంతానికి వెళ్తున్నటువంటి విద్యార్థులకు సూచనలు ఇవ్వడం జరిగింది వెళ్లినటువంటి వాళ్ళు విజయాలను సాధించి మన మక్తల్ ప్రాంతానికి వన్నె తీసుకొచ్చి తల్లిదండ్రుల పేరు ప్రాఖ్యాతలు తేవాలని వారు చెప్పడం జరిగింది. కరాటే విద్యార్థిని విద్యార్థులకు శాలువలతో ఘనంగా వారిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎగ్జామినర్ అంబ్రేష్, టోర్నమెంట్ ఇంచార్జ్ ఎండి సలీం, బ్లాక్ బెల్ట్ అశోక్ ధర్మ, అనిల్,శ్రీనివాసులు, కీర్తి ,అఖిల, వంశీ ,మనీష్, వినయ్ కుమార్, అన్సారి, హాయతి లు టోర్నమెంట్లో పాల్గొన్నారని వారు తెలియజేయడం జరిగింది ఈ సన్మాన కార్యక్రమంలో గోవిందు కరాటే విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సింగిరెడ్డి లక్ష్మారెడ్డి అంతిమ యాత్రలో ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులు

మెదక్ మనోహరాబాద్ (వాయిస్ టుడే న్యూస్): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సింగిరెడ్డి లక్ష్మారెడ్డి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ అభివృద్ధి సురక్ష దశాబ్ది ఉత్సవంలో పాల్గొని విధులు నిర్వహించుకొని తిరుగు ప్రయాణంలో అకస్మాత్తుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ యశోద ఆసుపత్రిలో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు చిట్కుల మహిపాల్ రెడ్డి తో కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కానిస్టేబుల్ సింగిరెడ్డి లక్ష్మారెడ్డి భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కానిస్టేబుల్ సింగిరెడ్డి లక్ష్మారెడ్డి గారి మృతి చాలా బాధాకరమని విచారాన్ని వ్యక్తం చేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతునితో కోరుకున్నారు.

కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి అవయవాల దానం కిడ్నీ, గుండె, కాలేయం, కండ్లు అవయవ దానం చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. వంటెర్ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ చిట్కుల మహిపాల్ రెడ్డి అభినందనలు తెలిపారు .ఈ అవయవదానంతో 8 మంది ప్రాణాలను నిలిపే గొప్ప అవయవ దాన కర్ణుడు కానిస్టేబుల్ సింగిరెడ్డి లక్ష్మారెడ్డి అని చైర్మన్ వంటెర్ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ చిట్కుల మహిపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలిపారు.

అతడి అంతిమ యాత్రలో మెదక్ జిల్లా ఎస్.పి శ్రీమతి పి.రోహిణి ప్రియదర్శిని ఐ.పి.యెస్ , స్థానిక సిఐ శ్రీధర్, ఎస్సై సురేష్ కుమార్, సందీప్ రెడ్డి, శివ్వంపేట ఎస్సై రమణ కాంతరావు లు పాల్గొని కుటుంబ సబ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిచ్చారు. మరణ వార్త జిల్లా పోలీస్ యాంత్రాంగాన్ని కలచివేసిందని కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చారని వారి ఔదార్యాన్ని కొనియాడారు. మరణ వార్తను దిగమింగుకుని అవయవ దానం చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. తాను చనిపోతు కూడా తన అవయవ దానంతో పది మందికి ప్రాణం పోస్తున్నాడని అతని సేవలు అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అతడు అనతి కాలంలోనే తన విది నిర్వహణలో ఉత్తమ కోర్ట్ కానిస్టేబులో గా ఉన్నతాదికారుల మన్ననలు పొంది ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నాడని అతడి సేవలను కొనియాడినారు. తన మరణం పట్ల జిల్లా పోలీస్ యాంత్రాంగం ప్రాగాఢ సంతపాన్ని తెలియజేస్తున్నామని అన్నారు. తన కుటుంబానికి జిల్లా పోలీస్ వ్యవస్థ ఎల్లవేళలా అండగా ఉంటూ తమ వెన్నంటే ఉంటామని వారిని అన్నీ విదాల ఆదుకుంటామని అన్నారు. కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి గారు సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మహిపాల్ రెడ్డి, సర్పంచ్ నరాల ప్రబావతి పెంటయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు , ఎస్సై సందీప్ రెడ్డి, పోలిస్ అదికారులు, ఎస్సై లు పోలిస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

దొంగలు దొంగలు కలిసి ఊళ్ళు పంచుకొన్న చందంగా దశాబ్ది ఉత్సవాలు

కోదాడ ::జూన్9 (వాయిస్ టుడే). నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంగా ప్రత్యేక తెలంగాణా కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన విద్యార్థులు, ఉద్యోగులు, ఉద్యమకారులను విస్మరించి కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేస్తూ జరుపుతున్న దశాబ్ది ఉత్సవాలు దొంగలు దొంగలు కలిసి ఊళ్ళు పంచుకున్న చందంగా ఉన్నాయని , కోదాడకు చెందిన సామాజిక ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం సిద్ధించినా ఈనగాచి నక్కల పాలైన చందంగా ప్రత్యేక రాష్ట్ర ఫలాలు ప్రజలకు అందని ద్రాక్షలుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఎలాంటి స్వార్థం లేకుండా నిస్వార్థంగా పోరాడిన ఉద్యమకారులను రాష్ట్రం ఏర్పడిన తరువాత పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. తెలంగాణా ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని తెలంగాణ ద్రోహులు ఈనాడు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా అధికారం చేపట్టి బోనాలు, బతుకమ్మలు మీకు, భోగభాగ్యాలు మాకు అన్న చందంగా దశాబ్ది ఉత్సవాలు జరుపు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఫలాలు అందరికీ దక్కాలంటే ప్రజాకవి కాళోజి చెప్పినట్లు ప్రాంతేతరుడు తప్పు చేస్తే ప్రాంతం నుండి తన్ని తరుముదాం, ప్రాంతం వాడే తప్పు చేస్తే ప్రాంతంలోనే పాతరేద్దామనే నినాదంతో ప్రజాస్వామిక తెలంగాణా కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు.

నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్స్/ట్రాలీలకు చెక్

నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్ల పై తిరిగే ట్రాక్టర్స్ పై చీటింగ్ కేసులు నమోదు చేస్తాం

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, జూన్ 9 (వాయిస్ టుడే): జిల్లాలో రిజిస్ట్రేషన్ నంబర్,నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్ల మీద తిరుగుతున్న ట్రాక్టర్స్ / ట్రాలీ ల పై గత మూడు రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 513 వాహనాలను గుర్తించి అట్టి వాహనాదారులకు జరిమన విధించి,ట్రాక్టర్స్ డ్రైవర్స్ కి అవగాహన కల్పించి నెంబర్ ప్లేట్స్ ఏర్పాటు చేయడం జరిగింది అని,ఇక పై నెంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపిన నంబర్ ప్లేట్ దాచినా లేదా కొన్ని నంబర్లు తొలగించినా ఛీటింగ్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ శుక్రవారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో ట్రాక్టర్స్ డ్రైవర్స్ ఇష్ట రీతిన ట్రాక్టర్స్ / ట్రాలీ లు నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్నారని,వీరికి చెక్

పెట్టడానికి జిల్లాలో 5 తేదీ నుండి 8 తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 513 వాహనాలు గుర్తించి జరిమానాలు విధించడం తో పాటుగా అట్టి వాహనాలకు నెంబర్ ప్లెట్స్ ఏర్పాటు చేసి ఇకపై నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్ల పై తిరుగుతే చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం జరిగింది అన్నారు.ట్రాక్టర్స్ డ్రైవర్స్ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించలని,పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిత్యం తనిఖీలు నిరహిస్తామని, ఇష్ట రీతిన ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ వేగంగా నడుపుతూ తోటి వాహదారులకు,ప్రజలకు పాదాచారులను భయభ్రాంతులకు గురి చేసిన,మైనర్ డ్రైవింగ్ చేసిన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండ వాహనం నడిపిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ట్రాఫిక్ నియమాలను పాటించకుండా వాహనాలు నడుపుతూ పోలీసులు విధిస్తున్న ఈ- చాలానాల బారి నుండి తప్పించుకునేందు తమ వాహనాలకు సంబందించిన నెంబర్ ప్లేట్ కి బదులు వేరే నెంబర్ ప్లేట్లను అమర్చి వాడినట్లైతే అలాంటివారిని గుర్తించి కఠినమైన చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లా పరిదిలోని ప్రజలు అందరు పోలీస్ కీ సహకరించలని, తమ వాహనాల నెంబర్ ప్లేట్స్ నిబందనల ప్రకారం బిగించు కోవాలని,నిబందనలకు విరుద్దంగా నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసి వాహనం నడిపితే వాహనదారుడిపై ఛీటింగ్ కేసులను నమోదు చేయబడుతాయని అన్నారు.

పుట్టినరోజు సందర్భంగా ఇందిరా అనాధ వృద్ధాశ్రమానికి నిత్యవసర వస్తువులు అందజేత

మునగాల జూన్ 09(వాయిస్ టుడే): మునగాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామపంచాయతీలో ఉన్న ఇందిరా అనాధ వృద్ధాశ్రమానికి కోదాడ పట్టణానికి చెందిన బత్తుల ఆదినారాయణ ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు మానసిక వికలాంగులకు ఒక వారానికి సరిపడా నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత ఆదినారాయణ మాట్లాడుతూ ఇటీవల మునగాల మండలానికి చెందిన సామాజిక ఉద్యమకారులు డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఇచ్చిన పిలుపులో భాగంగా తమ పుట్టినరోజులు వివాహ వార్షికోత్సవాలు ఇతరత్రా కార్యక్రమాల సందర్భంగా ఇలాంటి ఆశ్రమాలలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందించి అండగా నిలవాలని కోరిన నేపథ్యంలో వివిధ దినపత్రికలలో సామాజిక మాధ్యమాలలో చూసి తన పుట్టినరోజు సందర్భంగా ఈ ఆశ్రమాన్ని సందర్శించి ఇక్కడ ఉన్న వృద్ధుల అనాధల ఆకలి తీర్చడానికి తన వంతుగా ఒక వారానికి సరిపడా నిత్యవసర వస్తువులు అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని. ఇలా ప్రతి ఒక్కరూ తమ తమ కుటుంబంలో జరిగే వివిధ కార్యక్రమాల సందర్భంగా తమకు తోచిన విధంగా సహకారాన్ని అందించింది అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ కుటుంబ సభ్యులు భార్య బత్తుల రాజేశ్వరి కూతురు భవ్య శ్రీ కుమారుడు శశాంక్ ఆశ్రమం నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు తప్పక బడిలోనే ఉండాలి

మన ఊరు మనబడి తరువాత పాఠశాలలు సమూల మార్పులు

బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న -ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబు

కోదాడ /నడిగూడెం:: జూన్9(వాయిస్ టుడే) నడిగూడెం మండలం చాకిరాల గ్రామంలోని బడిబాట కార్యక్రమంలో శుక్రవారం నడిగూడెం మండల పరిషత్ అధ్యక్షురాలు యాతాకుల జ్యోతి మధుబాబు పాల్గొని మాట్లాడుతూ..... సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని మన ఊరు-మన బడితో పాఠశాలల రూపురేఖలు మారాయని అన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన, వసతులు కల్పించేందుకు మన ఊరు-మనబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రతి ఒక్కరు మిమి పిల్లలను సర్కారు బడుల్లో చేర్చాలని ఉన్నత చదువులు చదివిన క్వాలిఫైడ్ ఉపాధ్యాయులచే సర్కారు బడుల్లో విద్యాబోధన జరుగుతున్నదని సర్కారు బడుల్లో విద్యార్థులకు సన్నబియ్యం తో భోజనం పెడుతుందని అన్నారు. ఉచితంగా ఆంగ్ల విద్య తో పాటు ఉచిత పుస్తకాలు దుస్తులు ఈ ఏడాది కొత్తగా నోటు పుస్తకాలు కూడా ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. బడి ఈడు పిల్లలను కచ్చితంగా బడికి పంపించాలని అన్నారు. ఈ బడిబాట కార్యక్రమం 3వ తారీకు నుంచి 9 వ తారీకు వరకు స్పెషల్ డ్రైవ్ లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అందరూ కూడా బాగా కృషి చేసి విద్యార్థుల సంఖ్యను పెంచుతున్నారని ఆశిస్తున్నాను. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాతాకుల వీరస్వామి ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు రవీందర్ సి ఆర్ పి నందిగామ రామారావు, అంగన్వాడీ టీచర్ మౌనిక, గ్రామస్తులు మిట్ట గనుపుల మోసే, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దుబ్బాకలో జాబ్ మేళ

ఏర్పాట్లను పరిశీలించిన దుబ్బాక శాసనసభ్యులు రఘునందన్ రావు

దుబ్బాక (వాయిస్ టుడే) : రేపు దుబ్బాక పట్టణం కేంద్రంలోని కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించే మెగా జాబ్ మేళా ఈరోజు సాయంత్రం దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు గారు పర్యవేక్షించారు. మెగా జాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని దుబ్బాక నియోజకవర్గం లోని నిరుద్యోగులంతా పెద్ద ఎత్తున పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక శాసన సభ్యులు మాధవనైన రఘునందన్ రావు గారు కోరారు చాలామంది నిరుద్యోగులు ఉద్యోగాలు రాక కొన్ని సంవత్సరాలుగా ఉంటున్నారు కాబట్టి వివిధ కంపెనీలలో మీరు మంచి ఉద్యోగం గురించి చేసుకోవాలని యువత అంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని అన్నారు బ్యాంకు కు సంబంధించి మీకు ఏ ఏ జాబ్ చేయాలనుకుంటున్నారా మీయొక్క బయోడేటా తెచ్చుకోవాలని మరియు ఈ అవకాశాన్ని మన దుబ్బాక నియోజకవర్గం యువత అంతా వినియోగించుకోవాలని దుబ్బాక శాసనసభ్యులు మాధవనేని రఘునందన్ రావు రేపు ప్రొద్దున 10 గంటలకు జాబ్ మేళ స్టార్ట్ అవుతుంది కాబట్టి యువత అందరూ వచ్చి పాలుపంచుకోవాలని శాసనసభ్యులు గారు కోరుతున్నారు .

దిగుమతి చేసుకునే దశ నుండి ఎగుమతి చేసుకునే స్థాయి వరకు

నల్లగొండ పొట్టేలు మాంసానికి భారీ డిమాండ్

విజయవంతంగా రెండో విడత గొర్రెల పంపిణీ

టేకుమట్ల గొర్రెల పంపిణీలో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట:బీ జూన్ 9(వాయిస్ టుడే) తెలంగాణా రాష్ట్రంలో మాంసం దిగుమతి నుండి ఎగుమతి చేసే స్థాయికి ఎదగ బోతుందని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. జంట నగరాలలో నల్లగొండ పొట్టేలు మాంసానికి భారీ డిమాండ్ పెరిగిందని ఆయన తెలిపారు.రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన నేడు సూర్యాపేట మండలం టేకుమాట్ల గ్రామంలో ప్రారంభించారు.జిల్లా కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యం పి పి రవీందర్ రెడ్డి,జడ్ పి టి సి జీడీ బిక్షం జిల్లా పశు సంవర్ధకశాఖా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా పొట్టేలు మాంసానికున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని గొర్రెలను పెంచగలిగితే గొర్ల కాపరులు ఆర్థికంగా సుసంపన్నం అవుతారు అన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అని ఆయన స్పష్టం చేశారు.అందులో భాగమే కుల వృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు.ఇది తెలియక గొర్లు,బర్రెలు అంటూ వక్ర బాష్యాలు చెబుతాన్నారని ఆయన విరుచుకుపడ్డారు. కుల వృత్తులు చేసుకుంటామంటూ ముందుకు వచ్చే వారికి చేయుత నివ్వడం ప్రభుత్వ ధర్మమని వారు అధికారంలో ఉండగా ఆ ధర్మాన్ని విస్మరించి అధర్మంగా పాలించినందునే తెలంగాణాలో ఆకలి చావులు ఆత్మహత్యలు సంభవించాయని ఆయన మండిపడ్డారు. అటువంటి సంక్షోభం నుండి తెలంగాణాను బయట గట్టెక్కించడం తో పాటు సుభిక్షంగా మార్చిన ఘనత ముమ్మాటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ దే నన్నారు.అధికారంలో ఉండగా ఏనాడు ప్రజా సంక్షేమం గురించి పట్టించుకోని నేతలు ఇప్పుడు దయ్యాలు వేదాలు వల్లించిన చందంగా కువిమర్శ లకు దిగుతున్నారని ఆయన విమర్శించారు.అర్థం తెలియని వారే అడ్డ దిడ్డంగా మాట్లాడి కుల వృత్తులను కించ పరుస్తూన్నారని ఆయన ఆరోపించారు. గొర్రెల పెంపకం మునుముందు రాష్ట్రానికి పెద్ద పెట్టుబడిగా మారనుందన్నారు.గొర్రెల పెంపకానికి అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేసే వేసులు బాటు ఉంటుందన్నారు.అందులో మొదటిది తోళ్ల పరిశ్రమ అయితే మరోటి మాంసాన్ని అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేసేందుకు వీలుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉంటుందన్నారు.చివరి లబ్ది దారుడి వరకు గొర్రెలను పంపిణీ చేస్తామని మంత్రి జగదీష్ రెడ్డి స్పష్టంగా ప్రకటించారు.

గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పైపులు ధ్వంసం

కోదాడ:: జూన్ 9(వాయిస్ టుడే): సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురంలో వరి కోయలకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు , కాలి బూడిదైనా రామాపురం రైతు అలవాల రామారావు కు చెందిన పివిసి పైపులు, గేట్ వాళ్లు పూర్తిగా దగ్ధమై 30 వేలకు పైగా నష్టం జరిగినట్లు రైతు రామారావు వాయిస్ టు డేకు తెలిపారు. కరువు పని కి వెళ్లినవారు వాగు వద్ద చెత్తకు నిప్పు అంటించడంతో గాలికి మంటలు వ్యాపించి పైపులు తగలబడినట్లు రైతు వా పోతున్నాడు. ఇంకా గాలి ఉధృతి తగ్గడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, మోటర్లు పైప్ లైన్లు ధ్వంసమై లక్షల్లో నష్టం జరిగేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి పరిహారం అందజేయాలని రైతు రామారావు కోరారు. రైతులకు అవగాహన లేక వరి కొయ్యలకు నిప్పు అంటించడం రైతుకు తీవ్రంగా నష్టం జరుగుతుందని, భూమి పొరలు కాలిపోయి దిగుబడి తగ్గుతాయని రైతులు గ్రహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

యుద్ధ వీరుడు కల్నల్ సంతోష్ బాబు త్యాగం చిరస్మరణీయం

టిపిసిసి ఉపాధ్యక్షురాలు,కోదాడ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

కోదాడ:: జూన్ 9(వాయిస్ టుడే): దేశం కోసం కల్నల్ సంతోష్ బాబు చేసిన త్యాగాన్ని భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా కోదాడలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని టిపిసిసి ఉపాధ్యక్షురాలు,కోదాడ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారిపై వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యుద్ధ వీరుడు సంతోష్ బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో సైనికుల జీవితాల త్యాగ ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా బ్రతుకుతున్నామన్నారు. దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు కల్నల్ సంతోషబాబు అని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలను సాధించాలన్నారు.

ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర కార్యదర్శి చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు, వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ జగని ప్రసాద్, ఆర్యవైశ్య నాయకులు గరినె శ్రీధర్,వాసవి యూత్ క్లబ్ అధ్యక్షులు భరత్ కుమార్,ఉప్పల నవీన్, యదా కిరణ్,భరత్ చంద్ర,బండారు శ్రీనివాసరావు,సాయి, వెంపటి ప్రసాద్, రంజిత్, పైడిమర్రి సతీష్, రామారావు, పోలిశెట్టి సతీష్,తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులే సమాజ చైతన్యవంతులు

దుబ్బాక(వాయిస్ టుడే) : నిత్యం ఎంతో శ్రమకోర్చి ప్రపంచానికి సమాచారం అందిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని ఎస్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సామాజిక ప్రజాసేవకురాలు ,మహమ్మద్ సుల్తానా ఉమార్ ,అన్నారు. శుక్రవారం దుబ్బాక ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు నీటి శుద్ధ కరణ యంత్రం(వాటర్ ప్యూరిఫైయర్) అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తి కత్తి మీద సాములాంటిది అనే ప్రతిరోజు సమాచారం సేకరించడానికి. సరైన సమయానికి తిండి నిద్ర లేకుండా ఎంతో శ్రమించి ప్రపంచానికి సమాచారం అందిస్తారు. ఎంతోమంది జీవితాల్లో వెలుగు వీర జిమ్మే రాతలు వారి కలంతో రాస్తారు. కానీ వారి జీవితాల్లో మాత్రం అంధకారమే ఉంటుంది. ఎలాంటి వేతనం లేకుండా సమాజం పట్ల బాధ్యత గల వృత్తి జర్నలిజం.. ఎన్నో ప్రజాసమస్యలను వేలికి తీసి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమే కాకుండా పరిష్కార మార్గం చూపిస్తారు జర్నలిస్టులు. జర్నలిస్టుల ప్రోత్సాహంతోనే ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. మా ఎస్ ఆర్ ఫౌండేషన్ చేసే కార్యక్రమాలకు జర్నలిస్టుల సహకారం ఎనలేనిది అన్నారు. అనంతరం దుబ్బాక ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కాల్వ లింగం మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసుకున్న ప్రెస్ క్లబ్ కి తమ వంతు సహకారంగా నీటి శుద్ధికరమైన యంత్రం అందజేసిన ఎస్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. వారు చేసే ప్రతి కార్యక్రమానికి మా జర్నలిస్టుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి. పుట్ట రాజు, కోశాధికారి మహమ్మద్ ఉమర్, దుబ్బాక ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కృష్ణ రెడ్డి, జర్నలిస్టులు మూర్తి నరేష్నరేష్ రెడ్డి, భాస్కర్ గౌడ్, వెంకటేశ్వర్లు, అస్కారాజు, రవీందర్, నవీన్ కుమార్ ,అశోక్, రమేష్ రెడ్డి, హలీమూన్ బాబా, గట్టు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో బడిబాట

చేగుంట: మండల కేంద్రంలోని చేగుంట గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల గురించి ముఖ్యంగా ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, నోటు పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం, దుస్తుల పంపిణీ, డిజిటల్ బోధన సౌకర్యాలు ఉంటాయని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఉపాధ్యాయులు శారదా, చక్రధర్ శర్మ,యాదగిరి,ఈశ్వరయ్య, విజయ లతా, నాగ లక్ష్మి, సిఆర్పి రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ మొదటి స్థానంలో నిలుస్తుంది: మంత్రి గుంట కండ్ల జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, జూన్ 9 (వాయిస్ టుడే) సాధించి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజారంజన పాలన అందిస్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంట కండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సుమంగలి ఫంక్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ సంబురాలు వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా జరగని అభివృద్ధి సంక్షేమ పథకాలు సాధించు కొనే తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల అభిరుచి మేరకు అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. గత పాలకుల పాలనలో అనేక రంగాలు ప్రజలు ఎంతో నష్ట పోయాయని విద్యుత్, సాగు నీరు,తాగునీరు, అందక అష్ట కష్టాలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సి.యం. ఉన్నత మైన ఆలోచనలతో ప్రజలకు ప్రజారంజన పాలన అందిస్తున్నామని అన్నారు. ప్రధాన మంత్రి రాష్ట్రంలో కూడా ఇప్పటికి విద్యుత్ 6 గంటలు, పింఛన్లు, సాగునీరు, త్రాగునీరు అందించలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. తెలంగాణలో రైతు బంధు, దళిత బంధు, కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్, గృహాలకు, పారిశ్రామిక రంగాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అలాగే రైతాంగానికి ఉచితంగా నిరంతర విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలో గత పాలకుల పాలనలో విద్యుత్ సరిపడలేక, సాగునీరు, త్రాగునీరు అందక రైతుల ఆత్మహత్యలు, అరణ్య రోదనలు

వర్ణనాతితమని ఆ రోజులను గుర్తు చేశారు. 2014 తర్వాత జిల్లాలో దాదాపు రూ. 34 వేల కోట్ల రూపాయలతో ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలను అందించామని అన్నారు. నెర్రె బారిన నెలలలో కాళేశ్వరం నీటితో పుష్కలంగా రైతాంగానికి సాగునీరు అందించి జిల్లాలో పంట సాగు లో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టమని అన్నారు. సీఎం %ఎషతీ% రైతు సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని రైతు బంధు, రైతు బీమా, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అనుకున్న సమయానికి అందిస్తున్నని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ ద్వారా ద్వారా రూ. 5 లక్షల నిధులతో సూపర్ మార్కెట్, ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున చికెన్, మటన్, టిఫిన్ హోటల్ లను పెట్టుకునేందుకు చెక్కులను అందచేశారు. అదేవిదంగా బి.సి. కులాలకు చెందిన కుల వృత్తులకు నూరు శాతం సబ్సిడీతో లక్ష చొప్పున 6 గురు లబ్ధిదారుకు చెక్కులు అందజేశారు అలాగే సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన 215 మందికి కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకం ద్వారా లబ్ధిదారులకు రూ. 2 కోట్ల 16 లక్షల విలువగల చెక్కులను మంత్రి ఈ సందర్భంగా అందచేశారు.

అనంతరం కులాంతర వివాహం, దళిత బంధు, కల్యాణ లక్ష్మీ ద్వారా లబ్ది పొందిన లబ్దిదారులతో సభా వేదిక పై నుండి మాట్లాడించారు. సభలో తెలంగాణ సాంస్కృతిక సరాధులు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమలపై పాటల అలరింప చేశారు.

ఈ కార్యక్రమాంలో జిల్లా కలెక్టర్ యస్. వెంకట్రావ్, ఆదనవు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమల్ల అన్నపూర్ణ, గ్రంధాల య సంస్ట్ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, సూర్యాపేట జెడ్పిటిసి జిడి బిక్షం, జడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డిటిడిఓ కొమ్ము శంకర్, డి.ఎస్.పి నాగభూషణం, ఎంపీపీలు రవీందర్, నెమ్మాది బిక్షం, కుమారి , జడ్పీటీసీ లు, సర్పంచులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పుర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పనికిమాలినోళ్ల మాటలకు మోసపోవద్దు

కాంగ్రెసోళ్ల పాపాలను మేం కడిగాం
నాడు పింఛన్లు కోసం నిరాహార దీక్ష చేశా
రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్
రెండో విడత గొర్రెలు, బీసీ రుణాలు, ఇళ్ల పట్టాల పంపిణీ ప్రారంభం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన 9: 'పనికిమాలినోళ్లు ఊళ్లలోకి వస్తారు.. ఇంతి స్తాం.. అంతిస్తాం.. అంటారు. వారు చెప్పే మాటలకు మోసపోవద్దు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెసోళ్లు అనేక తప్పులు చేశారు. వారి పాపాలను మేం కడిగాం' అని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శు క్రవారం ఖమ్మంలో నిర్వహించిన సంక్షేమ దినోత్సవంలో ఆయన రెండో విడత గొర్రెల పంపిణీ పథకం, బీసీ రుణాలు మంజూరు, ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పింఛన్లు కావాలంటే పైసలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా ఇంటికే పథకాలు చేరుతున్నాయన్నారు. గతంలో పింఛన్లు ఇప్పించటానికి తాను ఖమ్మంలో దీక్షలు చేశానని, కానీ ఇప్పుడు ఖమ్మం నియోజకవర్గంలో 10 వేల పింఛన్లను 37,860 మంది అందిస్తున్నామన్నారు. ఆసరా ద్వారా ఏడాదికి రూ.100కోట్ల లబ్ధి కలుగుతోందని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ ద్వారా మరో రూ.100కోట్లు ఖమ్మం నియోజకవర్గ ప్రజలకు అందుతున్నాయన్నాయి. బీసీ రుణాల దృవపత్రాల కోసం ఈనెల 12న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ధ్రువపత్రాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్, ఖమ్మం కమిషనర్ అనురాగజయంతి, మేయర్ పునకొల్లు నీరజ, సుడా చైర్మన విజయ్‌కుమార్, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు పాల్గొన్నారు.

సమయానికి రాని గొర్రెల లారీ

రెండో విడత గొర్రెల పంపిణీ కోసం కార్యాచరణ చేసిన జిల్లా అధికారులు ఏపీలోని గుంటూరు ప్రాంతం నుంచి గొర్రెలను కొనుగోలు చేశారు. తీరా గొర్రెల పంపిణీ సమయానికి గొర్రెల లారీ రాకపోవడంతో కార్యక్రమం ఆలస్యంగా ప్రారంబమైంది. సభ అనంతరం మంత్రి పువ్వాడ లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమ కార్యక్రమాలు వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు విజయ సోపానాలు

ప్రభుత్వ చీఫ్ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

భువనగిరి, జూన్ 9 (వాయిస్ టుడే ప్రతినిధి):- తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాలను ప్రజలు దృష్టిలో పెట్టుకొని వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడతారని,ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావే ప్రభుత్వ పాలన చేస్తారని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల భాగంగా సంక్షేమ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయి సమావేశం శుక్రవారం ఆలేరు పట్టణంలోని దినేష్ గార్డెన్స్ లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొని సంబంధిత లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ,బిసి సంక్షేమం లక్ష రూపాయల ఆర్థిక సహాయం,నేతన్నకు బీమా 700 మందికి,కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హాయంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వందేనని ఆమె అన్నారు. నిరుపేద ప్రజలకు కాకుండా ప్రతి కులవృత్తి వర్గాల వారికి అన్ని సౌకర్యాలను అందజేసి వారిని అభివృద్ధి చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దేనిని ఆమె పేర్కొన్నారు. గతంలో దశాబ్దాల కాలంగా కాంగ్రెస్,టిడిపి అధికారంలో ఉండి ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదని,ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ద కాలంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు,రాష్ట్ర అభివృద్ధి, తాగు,సాగునీరు కోసం కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, చెరువుకుంటల మరమ్మత్తులు, మిషన్ భగీరథ పథకాలను ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్కే దక్కిందని ఆమె వివరించారు. ప్రజా అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేని కాంగ్రెస్ ఇతర పార్టీల వారు బిఆర్ఎస్ పై లేనిపోని ఆరోపణలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకోవడం ఆయా పార్టీలకు తగదని, వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాలను ప్రజలు దృష్టిలో పెట్టుకొని బిఆర్ఎస్ కు బ్రహ్మరథం పడతారని,ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి గా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావే ప్రభుత్వ పాలన చేస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పథి,బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ముంగిట్లోకి పరిపాలనకు అధికారులు శ్రీకారం చుట్టాలి

భువనగిరి యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పథి

దశాబ్ది ఉత్సవాలలో సుపరిపాలన దినోత్సవం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

భువనగిరి, జూన్ 9 (వాయిస్ టుడే ప్రతినిధి) :- తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.00 గంటలకు సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పథి తెలిపారు. శుక్రవారం నాడు అధికారులతో సుపరిపాలన దినోత్సవం ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. సుపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ సాధించిన తరువాత ఏర్పడిన కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల ఏర్పాటు ద్వారా ప్రజల ముంగిట్లోకి పరిపాలన రావడమే గాక సులభతరంగా పర్యవేక్షిస్తున్న విషయాలను తెలియచేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి సి.హెచ్. కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎం.నాగేశ్వర చారి, తదితర అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

మంచిర్యాల జిల్లా జూన్ 09 (వాయిస్ టుడే): మంచిర్యాల జిల్లాలో సీఎం పర్యటన సందర్భంగా జిల్లాలోని పలు పార్టీల నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ పోలీస్ స్టేషన్లకు తరలించారు మంచిర్యాల జిల్లా కేంద్రంలో బిజెపి కాంగ్రెస్ న్యూ డెమోక్రసీ మరియు వైయస్సార్ టిపి నాయకులను అరెస్ట్ చేశారు అరెస్ట్ అయిన వారిలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మల్లారెడ్డి మహిళా జిల్లా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి తులా ఆంజనేయులు,బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పట్టి కృష్ణ, పట్టణ జనరల్ సెక్రెటరీ ప్రభాకర్ రావు మూదాం మల్లేష్, విజయ్ రాకేష్, కే శివ,సాయి, కాంగ్రెస్ నాయకులు స్థానిక కౌన్సిలర్ మజీద్ సీనియర్ నాయకులు పూదరి ప్రభాకర్, సిరికొండ కుమార్ తదితరులు ఉన్నారుం.

ఎన్‌హెచ్ఏఐ ఆర్‌వోను కలిసిన బాధితులు

లక్షెట్టిపేట/హాజీపూర్, జూన్ 9: లక్షెట్టిపేట, హాజీపూర్, దండేపల్లి మండలాల మీదుగా జాతీయ రహదారి 63 భూనిర్వాసితులు మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్, జిల్లా అద్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఏఐ (నేషనల్ అథారిటీ హైవే ఆఫ్ ఇండియా) కార్యాలయంలో ఆర్‌వో జాన్‌బాజ్‌ను శు క్రవారం కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశాల మేరకు నష్టపోతున్న గ్రామాల ప్రజలకు జాతీయ రహదారి నిర్మాణంలో ఎలాంటి నష్టం లేకుండా రహదారి నిర్మాణం పునః పరిశీలన చేయాలని కోరారు. పట్టణాధ్యక్షుడు వీరమళ్ల హరిగోపాల్, ఎన్‌హెచ్ 63 భూనిర్వాసితులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు తీర్చేందుకే కాలేశ్వరం ప్రాజెక్టు రూపకల్పనతో బస్వాపురం ప్రాజెక్టుకు సాగునీరు: భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

భువనగిరి, జూన్ 9 (వాయిస్ టుడే ప్రతినిధి) :- రాష్ట్ర ముఖ్యమంత్రి మేధోమధనం చేసి వివిధ రంగాల అభివృద్ధితో సంపద సృష్టిస్తూ సంక్షేమ కార్యక్రమాలను దిగ్విజయంగా నడిపిస్తున్నారని, అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్నారని భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం నాడు భువనగిరి నియోజక వర్గానికి సంబంధించి స్థానిక ఎకె ప్యాలెస్ లో సంక్షేమ సంబూరాల కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధించుకున్న తరువాత అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా వుండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి గత తొమ్మిదేళ్లుగా ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ఇప్పుడు ఉత్సవాలు చేసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు ఏమి కావాలో ముందే ఆలోచించి వారి బాగుకోసం, తెలంగాణ ఏ విధంగా ఉండాలనే ఆలోచనలతో ముఖ్యమంత్రి ముందుగా కరెంటు కష్టాలు తొలగించి ఒక సంవత్సరంలోపే 24 గంటల కరెంటు ఇచ్చారని,దీంతో రైతుల కష్టాలు తీర్చారని,ఒకప్పుడు రైతుకు అప్పు కోసం మాత్రమే బ్యాంక్ ఖాతా వుండేదని, కానీ ఇప్పుడు రైతుబంధు, పెట్టుబడి సహాయం,ధాన్యం కొనుగోళ్ళు కోసం సరాసరి రైతు ఖాతాలోనికే

డబ్బులు జమ అవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి మేధోమధనం చేసి అన్ని రంగాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సంపద సృష్టిస్తూ వివిధ సంక్షేమ కార్యక్రమాల కోసం, అన్ని వర్గాల సంక్షేమ కోసం పాటుపడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ పమేళా సత్పథి ఆడపడుచులకు మేనమామగా వారి పెళ్లి సమయంలో కళ్యాలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో రూ.1,00,116/- లతో ఆడపడుచుల కుటుంబాలలో ధైర్యం నింపుతున్నారని, భువనగిరి నియోజక వర్గంలో ఇప్పటి వరకు 8100 మందికి కళ్యాణలక్ష్మి అందించినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టి ఎక్కడో ఉన్న గోదావరి నీళ్లను లిఫ్ట్ ద్వారా మన బస్వాపూర్ రిజర్వాయరుకు తీసుకురావడం జరుగుతున్నదన్నారు. మహిళల సంక్షేమ కోసం కళ్యాణలక్ష్మి, కెసిఆర్ కిట్స్, గర్భిణీ స్త్రీలకు ఆర్థిక సహాయం,న్యూట్రిషన్ కిట్స్ అందించడం జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. దళితబంధు పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఎన్నో కుటుంబాలు బాగుపడుతున్నాయని, 15 కుల వృత్తుల వారికి ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు ఆయన తెలిపారు. కొత్తగా గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలు ఏర్పడ్డాయని, తండాలు గ్రామ పంచాయితీలుగా మారాయని, అధికారులు ప్రజల వద్దకు వెళుతున్నారని, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో పి.ఎం. అభయ్ స్కీమ్, దళితబంధు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, చేనేత వృత్తుల వారికి, లబ్ధిదారులకు గొర్రెల యూనిట్ల పంపిణీ ,కుల వృత్తుల వారికి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు దీపక్ తివారీ, మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ అమరేందర్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అమరేందర్ గౌడ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. కృష్ణారెడ్డి, ఎంపిపిలు నరాల నిర్మల, ప్రభాకర్ గౌడ్, ప్రణీత పింగళ్ రెడ్డి, జడ్పిటిసిలు బీరు మల్లయ్య, పుష్పలత, ప్రభాకర్రెడ్డి, వాకిటి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేందర్రెడ్డి,సర్పంచ్ లు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.